



	గరిష్టం	కనిష్టం
ఖమ్మం	34.0	27.0
భద్రాద్రి	40.0	25.0



ఖమ్మంలో అసంపూర్తిగా ఉన్న రాజీవ్ స్వగృహ భవనాలు


గృహ యోగానికి గ్రహణం

రాజీవ్ స్వగృహ అపార్ట్‌మెంట్లకు మోక్షం లభించేదెన్నడు?

- ప్రభుత్వం మారినా.. ఇంకా అదే దుస్థితి
- రూ.కోట్ల విలువైన భవనాలు నిరుపయోగం
- కొనేవారున్నా ప్రభుత్వ నిర్లక్ష్యం

ఖమ్మం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మధ్యతరగతి వర్గాల సొంతింటి కలను నిజం చేసేందుకు ఉమ్మడి రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఖమ్మం నగర సమీపంలో రూరల్ మండలంలో 'రాజీవ్ స్వగృహ' పేరుతో నిర్మించిన అపార్ట్‌మెంట్లు నిరుపయోగంగా శిథిలమైపోతున్నాయి. ప్రస్తుతం ఆయా బహుళ అంతస్తుల భవనాలు మరో అమరావతి నిర్మాణాలను తలపిస్తున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన ఈ ఇళ్ల పథకాన్ని రాష్ట్ర విభజన తరువాత అధికారం చేపట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదు. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను పూర్తి చేయలేదు. దీంతో 15 ఏళ్లు దాటినా ఇవి అసంపూర్తిగానే ఉండడంతో సుమారు రూ.70కోట్లు ఖర్చుపెట్టి నిర్మించిన భవనాలు శిథిలమవుతున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సంబంధించి ఖమ్మంరూరల్ మండలంలో మున్నేరు పక్కన ఈ అపార్టుమెంట్లు నిర్మించారు. వ్యక్తిగత ఇళ్ల నిర్మాణానికి రఘునాథపాలెం మండలంలో సుమారు 100 ఎకరాలు గుర్తించినా నిర్మాణాలు చేపట్టకపోవడంతో రద్దుచేశారు.

అపార్టుమెంట్లను పూర్తిచేసి మధ్యతరగతి ఉద్యోగులకు ఇవ్వాలని, నిర్ణయించి ఒక్కోక్కరినుంచి అప్పట్లో మీసేవా ద్వారా రూ.3,500 స్వీకరించి పేర్లు నమోదు చేయించారు. ఆ తర్వాత పోలేపల్లి వద్ద మొత్తం 16 ఎకరాల్లో 7లక్షల 60వేల స్క్వేర్‌ఫీట్లతో 9ఫోర్లతో ఒక్కొక్క ఫ్లోర్‌లో 8ప్లాట్లు ఉండేలా అపార్టుమెంట్లు నిర్మించాలని నిర్ణయించారు. అందులో భాగంగా ముందు డబుల్‌బెడ్‌రూంకు సంబంధించి 288, త్రిబుల్‌బెడ్‌రూం 288, మొత్తం 576ప్లాట్లు నిర్మించారు. అయితే నిర్మాణం 60శాతం మాత్రమే పూర్తయింది. ఇంకా ప్లాస్టరింగ్, ఎలక్ట్రికల్ వర్క్, ఫ్లోరింగ్, ప్లంబింగ్ పనులు, రోడ్లు, కాంపౌండ్‌వాల్, స్విమ్మింగ్ పూల్, డ్రింకింగ్ వాటర్‌ప్లాంట్ వంటి నిర్మాణాలు చేపట్టాల్సి ఉన్నా ఆ పనులను పూర్తి చేయలేదు. 2008లో ప్రారంభించిన ఈ పనులు అసంపూర్తిగానే నిలిపేశారు. రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు చేపట్టిన ఈ పనులు ప్రభుత్వాలు మారడం, బుకింగ్ చేసుకున్న వారు అడ్వాన్స్ సొమ్ములు ఇవ్వకపోవడంతో రాజీవ్‌స్వగృహ ముందుకు కదలలేదు. అప్పట్లో ప్రభుత్వ నిర్వహణలో నిర్మించిన ఈ నిర్మాణ వ్యయం స్క్వేర్‌ఫీట్‌కు రూ.1,800వరకు ధర నిర్ణయించగా ప్రైవేటులో రూ.1,000నుంచి రూ.1,200వరకు ఉండడంతో రాజీవ్ స్వగృహవైపు ఎవరూ కన్నెత్తి చూడలేదు. మీసేవ ద్వారా బుకింగ్ చేసుకున్న వారు కూడా అధిక ధరలు చూసి ముందుకు రాలేదు. కాలక్రమేణా నిర్మాణ వ్యయాలు పెరగడంతో ఇప్పుడు స్క్వేర్‌ఫీట్‌కు ధరలు రెట్టింపయ్యాయి. మున్నేరు పక్కన నీటి సమస్యలేని ప్రాంతంలో ఈ రాజీవ్ స్వగృహ భవనాలు నిర్మించినా ప్రభుత్వం పనులు పూర్తిచేయకపోవడతో ఈ పథకం ఆదిలోనే ఆగిపోయింది. బ్యాంకులనుంచి తెచ్చిన అప్పుల వడ్డీలకు వడ్డీలు పెరిగాయి. గతంలో ఒకటి రెండుసార్లు యథాతథ స్థితిలో కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్లు టెండర్ పిలిచినా విడిగా కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. తరువాత ప్రభుత్వ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారుల సంఘాలు కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చినా గత ప్రభుత్వం దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా రాజీవ్ ప్రస్తుతం రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న పాలేరు నియోజకవర్గంలోనే ఈ రాజీవ్ స్వగృహ భవనాలున్నాయి. మంత్రి పొంగులేటి దీనిపై అధికారులతో సమీక్షించి నిర్ణయం తీసుకుంటే వృథాగా ఉన్న రాజీవ్ స్వగృహం పథకం ఇళ్లు వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది.



వైరాలోని కేవీసీఎం కాలేజీ భవనం

విద్య కోసం వితరణ

రూ.30కోట్ల ఆస్తులను ప్రభుత్వానికి ఇచ్చేందుకు వైరా కేవీసీఎం ట్రస్ట్ సిద్ధం

స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో ఖమ్మం జిల్లా వైరా ప్రాంతంలో సామాజిక స్పృహ కలిగిన కొందరు వ్యక్తులు కలిసి తమ ప్రాంతంలో విద్యాభివృద్ధి కోసం నడుం బిగించారు. విరాళాలు సేకరించి అనేక ఎకరాల భూములు సమీకరించారు. ఆయా భూముల్లో ఎడ్యుకేషన్ సొసైటీ పేరుతో విద్యా సంస్థలను స్థాపించి సమాజానికి సేవ చేశారు. కాలక్రమంలో ఆ ట్రస్ట్ కార్యకలాపాలు నిలిచిపోవడంతో ప్రస్తుతం ట్రస్ట్‌కు సంబంధించిన రూ. 30 కోట్ల విలువైన ఆస్తులను విద్యా అవసరాల కోసం ప్రభుత్వానికి అప్పగించేందుకు నిర్వాహకులు సిద్ధమయ్యారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది.

- విద్యాసంబంధిత అవసరాల కోసం వినియోగించాలని షరతులు
- స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వం సానుకూలం
- వేగంగా సాగుతున్న అప్పగింత ప్రక్రియ

వైరా, జూన్ 10: వైరాలోని కొండబోలు వెంకయ్యచౌదరి మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ (కేవీసీఎం)కు చెందిన సుమారు రూ.30కోట్ల విలువైన స్థలాలు, భవనాలను విద్యా అవసరాల కోసం ప్రభుత్వానికి అప్పగించేందుకు ట్రస్టు నిర్వాహకులు నిర్ణయించారు. సుమారు 70ఏళ్ల క్రితం వైరాలో విద్యాభివృద్ధి ఇతర అవసరాలకోసం నాటి ప్రముఖులు విరాళాలు వసూలు చేసి సమీకరించిన అనేక ఎకరాల భూములను సేకరించారు. వైరా మునిసిపాలిటీ పరిధిలోని సోమవరం గ్రామానికి చెందిన మధిర తొలి ఎమ్మెల్యే(1952) కొండబోలు వెంకయ్యచౌదరితో పాటు వైరాకు చెందిన అనేక ప్రముఖులు వైరాలో విద్యాభివృద్ధి కోసం పునాది వేశారు. 1953 ప్రాంతంలోనే ఆంధ్రానికేతన్ కమిటీ పేరుతో ప్రాథమిక పాఠశాలను ప్రారంభించారు. ఆ తర్వాత ఉన్నత పాఠశాలను ప్రారంభించి 1969వరకు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వం ఈ పాఠశాలను స్వాధీనం చేసుకుంది. తర్వాత ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. అదే సమయంలో వైరా ప్రముఖులు విద్యా ఇతరత్రా అవసరాల కోసం విరాళాలు వసూలు చేసి సర్వేనెంబర్ 72లో 9.7ఎకరాలు, సర్వేనెంబర్ 74ఆలో ఐదెకరాలు సమీకరించారు. ఈ భూముల్లోనే ఎస్సీ బాలుర, ఎస్సీ బాలికల హాస్టళ్ల భవనాలను నిర్మించారు. ఇందులో కొంత భూమి అన్యాక్రాంతం కాగా ప్రస్తుతం 9.7ఎకరాలు ఉన్నాయి. ఈ ఆస్తుల విలువ సుమారు రూ.30కోట్లు ఉంటుంది.



కొండబోలు వెంకయ్యచౌదరి

1992లో కేవీసీఎం డిగ్రీ కాలేజీ ఏర్పాటు..

వైరాలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కొండబోలు వెంకయ్య (మిగతా 6వ పేజీలో)

కేవీసీఎం భవనాల్లో తాత్కాలికంగా వంద పడకల ఆస్పత్రి

వివరాలు : 6లో

పదోన్నతుల్లో అక్రమాలు

వైద్యవిధాన పరిషత్‌లో ఇద్దరి సస్పెన్షన్

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 10: వైద్య విధాన పరిషత్‌లో పనిచేస్తున్న సమయంలో జిల్లా హెడ్ క్వార్టర్స్ హాస్పటల్‌లో ఏడుగురు వ్యక్తులకు అక్రమంగా పదోన్నతులు కట్టబెట్టారనే ఆరోపణలపై ఇద్దరిని సస్పెండ్ చేస్తూ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు వెల్లడించారు. కార్యాలయంలో పనిచేస్తున్న ఆఫీస్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ ఎస్.జ్యోతి అప్పట్లో పదోన్నతుల విషయంలో అక్రమాలకు పాల్పడ్డారంటూ ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇటీవలె విచారణ నిర్వహించిన అధికారులు నివేదికల ఆధారంగా ఇద్దరినీ సస్పెండ్ చేస్తూ సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

తప్పుడు రిజిస్ట్రేషన్ రద్దు

ఖమ్మంకార్పొరేషన్, జూన్ 10: తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో చేయించుకున్న రిజిస్ట్రేషన్‌ను అధికారులు రద్దు చేశారు. నగరంలోని ఖానాపురం హవేలి పరిధిలోని విజయనగర్ కాలనీలోని స్థలాన్ని కొంతమంది వ్యక్తులు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు చూపి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ సంఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు ఖమ్మం టుటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆరుగురిపై కేసు నమోదైంది.

మాటల్లో పెట్టేసి... బంగారం కొట్టేసి..

- రూ.5లక్షల విలువైన ఆభరణాల చోరీ

ఖమ్మం క్రైం, జూన్ 10: బస్సు ఎక్కిన మహిళ బ్యాగులోని రూ.5లక్షల విలువైన బంగారాన్ని ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన సంఘటన సోమవారం ఖమ్మం నగరంలోని కొత్త బస్టాండ్‌లో చోటు చేసుకుంది. టుటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ద్వారకానగర్‌కు చెందిన ఎనుముల రమాదేవి విజయవాడ వెళ్లేందుకు కొత్త బస్టాండ్‌లో బస్సు ఎక్కింది. సీట్లు ఖాళీ లేకపోవడంతో ఓ మహిళ పక్కన కూర్చున్న వ్యక్తి లేచి ఆమెకు సీటు ఇచ్చాడు. తర్వాత తన బ్యాగును పైన పెట్టుకోండి అంటూ సలహా ఇచ్చాడు. దీంతో సదరు మహిళ బ్యాగును బస్సులో పైన పెట్టింది. కొద్దిసేపటి తర్వాత బ్యాగులో బంగారం ఉన్న విషయం గుర్తుకు వచ్చి బ్యాగును తీసిచూసింది. దీంతో బ్యాగులో బంగారం కనపడకపోవడంతో ఆందోళనకు గురై సలహా ఇచ్చిన వ్యక్తిని వెతికింది. దీంతో సదరు వ్యక్తితోపాటు అతడి పక్కన ఉన్న మరో వ్యక్తి కూడా కనబడకపోవడంతో సదరు మహిళ టుటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బ్యాగులో సుమారు రూ.5లక్షల విలువ చేసే 80 గ్రాము ల బంగారం ఉన్నట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యా దు చేసింది. ఫిర్యాదు అందిన టుటౌన్ పోలీసులు బస్టాండ్ వద్దకు వెళ్లి అక్కడున్న సీసీ కెమెరాలను పరిశీలించి, ఇద్దరు నిందితులను గుర్తించారు. కాగా వారి వివరాలు తెలుసుకునేందుకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఉన్నతాధికారులు

వివరాలు : 6లో

'ధరణి' సమస్యలు తీరేనా?

- ప్రజావాణిలో భూ సమస్యలే అధికం
- బారులు తీరిన దరఖాస్తు దారులు



సమీక్షలో అమాత్యులు

రైతు రుణమాఫీ, ఖరీఫ్ సాగుపై సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్‌లో సోమవారం సమీక్ష జరిగింది. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ సలహాదారు వేం.నరేందర్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి పాల్గొన్నారు.

దైవ దర్శనానికి వెళ్లి అనంతలోకాలకు..



నాగమణి



తేజశ్రీనివాస్

- గోదావరిలో మునిగి తల్లి, కుమారుడు మృతి
- మృతులు భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట వాసులు
- ఏపీలోని వేలేరుపాడు మండలంలో ఘటన

అశ్వారావుపేట రూరల్, జూన్ 10: దైవదర్శనానికి వెళ్లి సరదాగా స్నానాలు చేసేందుకు గోదావరిలోకి దిగిన తల్లీకొడుకులను మృత్యువు కబళించింది. కళ్లముందే నీటిలోకి జారిపోతున్న కొడుకును రక్షించే క్రమంలో తల్లి కూడా గోదావరిలోకి గల్లంతై విగతజీవులుగా మారారు. ఏపీలో ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలోని కట్కూరు వద్ద జరిగిన ఈ ఘటనలో భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట పట్టణానికి చెందిన తల్లీకొడుకులు మృతిచెందారు.

అశ్వారావుపేట పట్టణంలోని చిన్నంశెట్టిబజారుకు చెందిన అల్లంశెట్టి నాగేశ్వరరావు, వి.వెంకటేశ్వరావు కుటుంబాలకు చెందిన 11మంది సోమవారం ఉదయం రెండు ఆటోల్లో సరిహద్దున ఆంధ్రాలోని వేలేరుపాడు మండలంలోని కట్కూరులోని శివాలయానికి దైవదర్శనానికి వెళ్లారు. దర్శనం అనంతరం పిల్లలు గోదావరిలో స్నానాలు చేస్తామని కోరటంతో అందరూ పక్కనే ఉన్న నదిలోకి స్నానానికి దిగారు. అందరూ నవ్వుతూ కేరింతలు కొడుతూ సరదగా గడుపుతుండగా నాగేశ్వరరావు కుమారుడు తేజ శ్రీనివాస్ (23) ప్రమాదవశాత్తు కాలుజారి నదిలో లోతుగా ఉన్న ప్రదేశానికి జారిపోతుండగా పక్కనే ఉన్న అతడి తల్లి నాగమణి(45) కొడుకును పట్టుకుని లాగే ప్రయత్నం చేసింది. అయితే గోదావరి ప్రవాహానికి ఇద్దరూ నదిలో కొట్టుకుపోయారు. అందరూ చూస్తుండగానే లోతులోకి వెళ్లిపోయి గల్లంతయ్యారు. దాంతో బాధిత కుటుంబసభ్యులు అధికారులకు సమాచారం అందించారు. తరువాత స్థానిక పోలీసులు గజ ఈతగాళ్లతో గల్లంతైన తల్లీకొడుకుల కోసం గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టారు.

ఈ క్రమంలో సాయంత్రం వేళ తల్లి కుమారుడి మృతదేహాలు లభ్యమయ్యాయి. కళ్లెదుటే భార్య, చేతికి వచ్చిన కుమారుడు కొట్టుకుపోతున్నా ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో ఉండిపోయానని నాగేశ్వరరావు బోరున విలపించాడు. అల్లంశెట్టి నాగేశ్వరరావు, నాగమణి దంపతులు అశ్వారావుపేటలో బత్తాయిజ్యూస్ దుకాణం నిర్వహిస్తూ జీవిస్తుండగా వారి కుమారుడు తేజ కిరాణాదుకాణంలో పనిచేస్తున్నాడు. వీరిద్దరి మృతితో అశ్వారావుపేటలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



మృతదేహాన్ని వెతికి తీసుకొస్తున్న గజ ఈతగాళ్లు

వేతనాల కోసం

కార్మికుల సమ్మె

భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో ఆందోళన



చిన్నపిల్లలతో కలిసి సమ్మెలో సిబ్బంది

భద్రాచలం, జూన్ 10: ఏరియా వైద్యశాలలో వివిధ విభాగాల్లో పని చేసే కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి సమ్మె నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి పారిశుధ్య పనులు నిలిపివేయడంతో రోగులు, వైద్యశాల సిబ్బంది ఇబ్బంది పడ్డారు. అనంతరం సమ్మె శిబిరాన్ని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి నెల 7వ తేదీన కార్మికులకు వేతనాలు చెల్లించాలని జీవోలో ఉన్నప్పటికీ చెల్లించడం లేదని, పీఎఫ్, ఈఎస్ఐ వివరాలు కార్మికులకు చెప్పడం లేదన్నారు. విషయం తెలుసుకున్న ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డా.రామకృష్ణ పీవో దృష్టికి తీసుకెళ్లడంతో పీవో ప్రతీక్‌జైన్ తక్షణమే ఒక నెల వేతనం మంజూరు చేశారు. అనంతరం సమ్మె విషయం తెలుసుకొని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు శిబిరానికి వచ్చి మిగతా రెండు నెలల వేతనాలు పది రోజుల్లో చెల్లించేందుకు కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో సమ్మె విరమించారు.

ప్రభుత్వ వికలాంగుల వసతి గృహంలో

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్ 10:శారీరక దివ్యాంగుల కొరకు నగరంలోని రోటరీనగర్‌లోని ప్రభుత్వ వికలాంగుల వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా మహిళా శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి కే.రాంగోపాల్ రెడ్డి తెలిపారు. ఈ వసతి గృహంలో 3వ తరగతి నుంచి 10వ తరగతి చదివే శారీరక దివ్యాంగ బాలురు అర్హులు అని తెలిపారు. ఉచిత భోజనం, నోట్ బుక్స్, దుప్పట్లు, అన్ని వసతి సౌకర్యాలు, వైద్య సేవలు అందించటం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో చదువుతున్నవారు ఒరిజనల్ బోనఫైడ్ పొంది దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ దరఖాస్తులను జూలై 30లోగా జిల్లా మహిళా శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో అందించాలని తెలిపారు.

డీఈఈ సెట్ నోటిఫికేషన్ విడుదల

ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్ 10: డీఈఈ (డిప్లమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్), డీపీఎస్ఈ (డిప్లమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్) కోర్సుల్లో చేరేందుకు డీఈఈసెట్ 2024 నోటిఫికేషన్ విడుదలైందని ఉమ్మడి ఖమ్మం జిల్లా విద్యా శిక్షణా సంస్థ ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు జూన్ 30 లోగా ఆన్‌లైన్‌లో పూర్తి వివరాలతో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఇంటర్‌లో 50శాతం మార్కులు ఉంటేనే అర్హులని తెలిపారు. షెడ్యూల్ తెగలు, షెడ్యూల్ కులాల, దివ్యాంగ అభ్యర్థులకు 45శాతం మార్కులు కలిగి ఉండాలని తెలిపారు. 2024 సెప్టెంబరు 1 నాటికి 17సంవత్సరాలు ఉండాలని తెలిపారు. గరిష్ఠ వయోపరిమితి లేదని తెలిపారు. ఆన్‌లైన్లో జూలై 10న పరీక్ష ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు విద్యా శిక్షణా సంస్థలో సంప్రదించాలని తెలిపారు.

ప్రారంభమైన ఈసెట్ కౌన్సెలింగ్

ఖమ్మం ఖానాపురంహవేలి జూన్ 10: నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో సోమవారం నుంచి టీజీ ఈసెట్ కౌన్సెలింగ్ ప్రారంభమైందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ జాకీరుల్లా తెలిపారు. ఈ నెల 12వరకు సర్టిఫికెట్ల పరిశీలన, 14వరకు వెబ్ ఆప్షన్స్, 18న మొదటి విడత సీట్ల కేటాయింపు, 21న సెల్ఫ్ రిపోర్టింగ్ ఉంటుందని కౌన్సెలింగ్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. జూలై 15 నుంచి 17వరకు చివరి విడత కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు. మొదటి రోజు 249మంది విద్యార్థులు స్లాట్ నమోదు చేసుకోగా.. 235మంది కౌన్సెలింగ్‌కు హాజరైనట్టు తెలిపారు.

పదేళ్లుగా మూసిన పాఠశాలను ప్రారంభించండి

▸▸ గ్రామస్థుల ఫిర్యాదుతో ఎమ్మెల్యే పాయం తక్షణ ఆదేశాలు..

మణుగూరుటౌన్, జూన్ 10: మణుగూరు మండల పరిధిలోని బొమ్మరాశిపల్లిలో పదేళ్ల క్రితం నుంచి మూసిన పాఠశాలను తిరిగి ప్రారంభించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. సోమవారం బొమ్మరాశిపల్లి గ్రామానికి చెందిన గ్రామస్తులు ఎమ్మెల్యే పాయం కలిసారు. తమ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలు గత పదేళ్లుగా మూసివేసారని ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే పాయం వెంటనే మండల విద్యాధికారికి ఫోన్ చేసే తిరిగి పాఠాశాలను పునఃప్రారంభించాలని అందుకు కావాల్సిన చర్యలను తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. అనంతరం బూర్గంమండల పర్యటనకు బయలుదేరారు. సాయంత్రం అశ్వాపురం మండలం ఎంపీపీ ముత్తినేని సుజాత భర్త, కాంగ్రెస్ నాయకులు వాసు జన్మదిన వేడుకల్లో పాల్గొని వాసుతో కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో తుక్లూరి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.


ఫిర్యాదును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయం

వైభవంగా రామయ్య పట్టాభిషేకం

ముత్తంగి అలంకారంలో దర్శనమిచ్చిన భద్రాద్రి రామయ్య

భద్రాచలం,, జూన్ 10: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి వారికి సోమవారం పట్టాభిషేకం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. పట్టాభిషేక కార్యక్రమాన్ని పుష్యమినక్షత్రం సమయాన భద్రాద్రి రామయ్యకు నిర్వహించారు. ముందుగా శ్రీసీతారామచంద్రస్వామిని నిత్య కల్యాణ మండప వేదిక వద్దకు తీసుకొచ్చారు. ఈ సమయంలో తొలుత స్వామివారికి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. నిత్య కల్యాణ ప్రక్రియలో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, యోక్త్రబంధనం, కన్యాదానం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, బ్రహ్మముడి, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు. అనంతరం సంకల్పం, కలశా వాహన, అష్టదిక్పాలక ఆవాహన, రామాయణంలోని పట్టాభిషేక ఘట్ట పారాయణం, పట్టాభిషేక వైభవ వివరణను రామాయణ పారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు వివరించారు. అనంతరం జలప్రోక్షణ, వేద ఆశీర్వచనం, మంగళహారతితో పట్టాభిషేక కార్యక్రమం పరిసమాప్తి అయ్యింది. భద్రాద్రి రామయ్య సోమవారం సందర్భంగా ముత్తంగి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సమయంలో స్వామివారిని భక్తులు అధికసంఖ్యలో దర్శించుకున్నారు. అలాగే శ్రీకాకుళానికి చెందిన పరిణమ్ రామారావు-కృష్ణవేణి దంపతులు చిత్రకూట మండపంలో కల్యాణం షైకొసెట్ నిమిత్తం రూ.1,55,000/-లను విరాళంగా అందజేశారు.


పట్టాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం


డిప్యూటీ సీఎం భట్టిని కలిసిన జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

పోలంపల్లి ప్రాజెక్టు మరమ్మతులకు సహకరించండి...

డిప్యూటీ సీఎం భట్టికి జగ్గయ్యపేట ఎమ్మెల్యే విజ్ఞప్తి

మధిరటౌన్, జూన్ 10: తెలంగాణ, ఆంధ్రా సరిహద్దులో మున్నేటిపై ఉన్న పోలంపల్లి ప్రాజెక్టు మరమ్మతులకు సహకరించాలని ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి విజ్ఞప్తి చేశారు. జగ్గయ్యపేట రైతులతో కలిసి ఆదివారం రాత్రి శ్రీరాం తాతయ్య మధిరలో భట్టిని కలిసి విజ్ఞప్తి చేశారు. గత సంవత్సరం కురిసిన వర్షాలకు ప్రాజెక్టు తెలంగాణ వైపు గండిపడటంతో నీరు వృథాగా పోతోందని, తద్వారా నీటి నిలువ సామర్థ్యం తగ్గి ఆంధ్రా ప్రాంతంలోని పొలాలకు సాగునీటికి ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత మొదటి సారి మధిరకు వచ్చిన తాతయ్యకు మధిర ఆర్యవైశ్య నాయకులు ఘనస్వాగతం పలికారు.

ఆదివాసీలకు అన్యాయం జరిగితే

సహించం

ఇల్లెందుటౌన్, జూన్ 10: సింగరేణి ఓసీ ఏర్పాటులో ఆదివాసీలకు అన్యాయం జరిగితే సహించబోమని తుడుం దెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, రాష్ట్ర కార్యదర్శి వట్టం ఉపేందర్ హెచ్చరించారు. సోమవారం సింగరేణి 21ఫిట్ ఏరియాలో జేకేఓసీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆదివాసీలతో సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేసే వరకు ఓసీ ఏర్పాట్లను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఓసీ ప్రాంతంలో ఉన్న ఆదివాసీ ప్రజానికానికి గ్రామసభ జరపాలని డిమాండ్ చేశారు. అధికారులు, సింగరేణి యాజమాన్యం ఆదివాసీ గిరిజనుల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తుందని విమర్శించారు. తప్పుడు పద్ధతుల్లో ఓసీ తీసేందుకు ప్రయత్నాలు చేస్తే అడ్డుకుంటామని ప్రకటించారు. ఈ సమావేశంలో తిలక్‌నగర్ పంచాయతీ మాజీ సర్పంచ్ ధనసరి స్రవంతి, తుడుందుబ్బ రాష్ట్ర నాయకులు రామ్మూర్తి, వట్టం కనకనయ్య తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ పరిశోధన

కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

అశ్వారావుపేట రూరల్, జూన్ 10: తెలంగాణాలో పామాయిల్ అత్యధికంగా సాగుచేసే అశ్వారావుపేట ప్రాంతంలో ఆయిల్‌ఫాం పరిశోధన, రైతు శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆయిల్‌ఫెడ్ అశ్వారావుపేట జోన్ ఆయిల్‌ఫాం గ్రోవర్స్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు తుంబూరు ఉమా మహేశ్వరరెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్య ఆయిల్‌ఫెడ్ ఎండీ అశోక్ రెడ్డిని కోరారు. ఈమేరకు సోమవారం హైదరాబాదులో ఆయిల్‌ఫెడ్ ఎండీ, హార్టికల్చర్ కమీషనర్ అశోక్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలకు అనుబంధంగా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. వ్యవసాయ కళాశాలలో 400 ఎకరాల భూమి, నీటి లభ్యత, ఆయిల్‌పాంకు అనుకూల నేలలు, నర్సరీలు, పరిశ్రమలులాంటివి పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. ఆయిల్‌పాం రైతులకు సాగులో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని, వాటి పరిష్కారానికి రైతు శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అధికారుల తప్పిదాల వలన నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎండీ తెలిపినట్లు నాయకులు తెలిపారు.


ఆయిల్‌ఫెడ్ ఎండీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణిలో పలువురికి పదోన్నతులు

రుద్రంపూర్ (సింగరేణి), జూన్ 10 : సింగరేణి సంస్థలోని వివిధ విభాగాల్లో పని చేస్తున్న పలువురు అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ సింగరేణి యాజమాన్యం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏజీఎంగా పనిచేస్తున్న పిల్లి సామేలు సుధాకర్‌కు జనరల్ మేనేజరు (పర్సనల్ అండ్ వెల్ఫేర్), రిక్రూట్‌మెంట్ సెల్‌కు పదోన్నతి కల్పించింది. ఎడ్యూకేషన్ సొసైటీలో ఏజీఎం పర్సనల్‌గా విధులు నిర్వహిస్తున్న నికోలస్‌ను జనరల్ మేనేజరు (ఎడ్యుకేషన్ సొసైటీకి) పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎడ్యుకేషన్ సొసైటీలో జనరల్ మేనేజరుగా పని చేస్తున్న నీలం వెంకటేశ్వరరావు డైరెక్టర్ ఆపరేషన్స్‌కు బదిలీ చేశారు. డిప్యూటీ జనరల్ మేనేజర్లుగా జే.వెంకటరమణ, మిరియాల శ్రీహరికి పదోన్నతులు కల్పించారు. పర్సనల్, ఫైనాన్స్ తదితర విభాగాల్లో పలువురు అధికారులు పదోన్నతులు కల్పించారు.

ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం

తెలంగాణ రాష్ట్ర కమిటీ ఎన్నిక

చుంచుపల్లి, జూన్ 10: ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం తెలంగాణ రాష్ట్ర కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. ఈ నూతన కమిటీలో రాష్ట్ర కన్వీనర్‌గా సువర్ణపాక నాగేశ్వరరావు, సభ్యులుగా చింత రజిత, ఉదయ్, జిసక్రు, పెనక భరత్, పూనెం నవీన్‌కుమార్, గోపి నర్సయ్య, ఆలె సర్వయ్యలు నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన అటవీ సంరక్షణ నియమాలు - 2022 చట్టాన్ని రద్దు చేసే వరకు పోరాడుతామన్నారు. పీసా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేలా పని చేస్తామన్నారు.


రాష్ట్ర కమిటీకి ఎన్నికైన సభ్యులు

కేవీసీఎం భవనాల్లో

తాత్కాలికంగా వంద పడకల ఆస్పత్రి

▸▸ వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ వెల్లడి


వైద్యఆరోగ్యశాఖ అధికారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, జూన్ 10: వైరాలోని కేవీసీఎం డిగ్రీ, ఎన్నారై పాలిటెక్నిక్ కళాశాల భవనాల్లో తాత్కాలికంగా వందపడకల ఆసుపత్రి ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఆ మేరకు సూత్రప్రాయంగా నిర్ణయం జరిగింది. ఆ విషయాన్ని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ వెల్లడించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, స్థానిక మాజీ సర్పంచ్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైద్యఆరోగ్యశాఖ అధికారులు, నాయకులతో కలిసి సోమవారం వైరాలో మూతపడి ఉన్న కేవీసీఎం డిగ్రీ, ఎన్నారై పాలిటెక్నిక్ కళాశాల భవనాలను, పరిసరాలను పరిశీలించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాలతో యుద్ధప్రాతిపదికన వైరాలో వంద పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని నిర్ణయం జరిగింది. వందపడకల ఆసుపత్రికి శాశ్వత భవనాలు నిర్మించేవరకు వేచిచూడకుండా వెంటనే ప్రైవేట్ భవనాల్లోనైనా ఆసుపత్రిని ఏర్పాటుచేసి ప్రజలకు వైద్య సేవలందించేందుకు ఏర్పాట్లు చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదివారం మధిర వచ్చిన సందర్భంగా తనను కలిసిన వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కు సూచించారు. దాంతో ఎమ్మెల్యే వెంటనే రంగంలోకి దిగారు.

వందపడకల ఆసుపత్రికి శాశ్వత భవనాలు ఏర్పాటు చేసేందుకు సేకరించిన రెవెన్యూ కార్యాలయం వెనుక భాగంలోని స్థలాన్ని ముందుగా పరిశీలించారు. ఈ స్థలంలో ఆసుపత్రి భవనాలు నిర్మించేందుకు కనీసం ఏడాది సమయమైనా పడుతుందని అప్పటివరకు వేచి చూడకుండా ఈ ఆసుపత్రిని ప్రైవేట్ భవనాల్లో ఏర్పాటు చేయాలని చర్చ జరిగింది. ప్రైవేట్ భవనాలకు బదులు పదేళ్ల నుంచి నిరుపయోగంగా ఉంటున్న కేవీసీఎం విద్యాసంస్థల భవనాల్లో తాత్కాలికంగా వంద పడకల ఆసుపత్రి ఏర్పాటు చేస్తే విశాలమైన ఆవరణం, పక్కాగా ఉన్న భవనాల్లో ఎలాంటి అద్దెలు లేకుండా ప్రభుత్వంపై భారం లేకుండా ఉంటుందని, రోగులకు సౌకర్యవంతంగా ఉపయోగపడుతుందని భావించి ఈ విద్యాసంస్థలను పరిశీలించిన ఎమ్మెల్యే తదితరులు ఇక్కడే తాత్కాలిక ఆసుపత్రిని ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. గతేడాది జూలైలో వైరాకు వందపడకల ఆసుపత్రి మంజూరైంది. డాక్టర్ల సహా సిబ్బంది మొత్తం 98 పోస్టులు మంజూరయ్యా యి.

ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, మునిసిపల్ కమిషనర్ సీహెచ్.వేణు, స్థానిక డాక్టర్ తాతా ఉదయలక్ష్మీ, వైరా, కొణిజర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణ, నాయకులు దాసరి దానియేలు, ఏదునూరి సీతారాములు, పమ్మి అశోక్, పల్లపు కొండలు, సూర్యదేవర శ్రీధర్, మల్లు రామకృష్ణ, మూడుముంతల గంగరాజ్‌యాదవ్, పాలేటి నర్సింహారావు, పఠాన్ జాన్ పాల్గొన్నారు.

చేతన ఫౌండేషన్‌కు 'ఆటా' పురస్కారం

తల్లాడ, జూన్ 10: అమెరికాలోని అట్లాంటా నగరంలో జరుగుతున్న అమెరికా తెలుగు అసోసియేషన్(ఆటా) మహాసభల్లో చేతన గ్లోబల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వెనిగండ్ల రవికుమార్‌కు పురస్కారం అందజేశారు. ఆట అధ్యక్షుడు మధు బొమ్మినేని చేతులమీదుగా రవికుమార్ అవార్డును అందుకున్నారు. చేతన ఫౌండేషన్ ద్వారా అమెరికా, భారతదేశంతోపాటు ఏడు దేశాల్లో స్వచ్ఛంద కార్యక్రమాలు, విద్యా, వైద్యం, మహిళా సాధికారిత, పర్యావరణం కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకుగానూ అవార్డును అందించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఈ అవార్డును చేతన ఫౌండేషన్‌లో అంకితభావంతో పనిచేస్తున్న ప్రతి వలంటీర్లకు అంకితం చేస్తున్నట్టు తెలిపారు.


అమెరికా ఆట తెలుగు అసోసియేషన్ నుంచి అవార్డు స్వీకరిస్తున్న రవికుమార్

'ధరణి' సమస్యలు తీరేనా?

▸▸ ప్రజావాణిలో అధికంగా భూ సమస్యలే ▸▸ బారులు తీరిన దరఖాస్తు దారులు ▸▸ పెద్ద సంఖ్యలో అర్జీలు సమర్పణ

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 10: తన గ్రామంలో సర్వే నెంబర్ 133/5లో.20 కుంటల భూమిని వేరే వ్యక్తి ఆక్రమించుకున్నారని తనకు న్యాయం చేయాలంటూ తిరుమలాయపాలెం నుంచి నేలమలి ఏసుబాబు జిల్లా అధికారులకు ఏకరువు పెట్టారు..

- తనకు 2 ఎకరాల భూమికి పాస్ పుస్తకం ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో భూమి తక్కువగా ఉందని సర్వే చేయించి తనకు హద్దులు చూపించాలంటూ వేంసూరు మండలం ఎర్రగుంటపాడుకు చెందిన వాసం లక్ష్మయ్య విజ్ఞప్తి..

- కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం గ్రీవెన్స్‌ను నిర్వహించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో మూడు నెలలుగా ప్రజావాణి కార్యక్రమాన్ని నిలిపివేయడంతో సోమవారం నాటి గ్రీవెన్స్‌కు ప్రజలు బారులు తీరారు. కలెక్టర్ వీపీ గౌతమ్ ఈ కార్యక్రమానికి హాజరు అవుతారని భావించినప్పటికీ ఆయన గైర్హాజరయ్యారు. అదనపు కలెక్టర్లు మధుసూదన్ నాయక్, బి.సత్యప్రసాద్, ఆర్డీవో గణేష్, డీఆర్డీవో సన్యాసయ్య తదితరులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. గ్రీవెన్స్ డేలో అర్జీదారులు సమర్పించిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి సత్వర పరిష్కార చర్యలు చూపాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, మధుసూదన్‌నాయక్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయలక్ష్మీ, డీఎంహెచ్‌వో డాక్టర్ బి.మాలతి, జడ్పీ సీఈవో వినోద్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి జి.శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

● ఎర్రుపాలెం మండలం మామునూరు మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో నకిలీ సభ్యులను తొలగించాలని, ఉద్యోగాలు ఖమ్మం పట్టణంలో చేసుకుంటూ సభ్యులుగా కొనసాగుతున్నారని ఫిర్యాదు చేశారు. అడ్డదారుల్లో సభ్యత్వం పొందిన వారిని తొలగించి వాస్తవ సభ్యులకు అవకాశాన్ని కల్పించాలంటూ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

● ఓ షాపు యజమాని ఇచ్చిన మందును పైరుపై పిచికారి చేస్తే తనకు చెందిన వరిపైరంతా ఎండిపోయి తీవ్రంగా నష్టపోయానని ఈ విషయమై మండల వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా కనీసం పట్టించుకోలేదంటూ ముదిగొండ మండలం పమ్మి గ్రామానికి చెందిన కోయ అనిత కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయనిర్మలను ఈ సంఘటనపై విచారించి నివేదికలు అందించాలంటూ అదనపు కలెక్టర్ ఆదేశించారు.

● నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ ప్రజలకు సేవ చేయాల్సిన పాపటపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి దురుద్దేశ్యంగా రాజకీయ నాయకుడిగా వ్యవహరిస్తూ ఒక వర్గం వారికి పనులు చేస్తున్నారని మిగిలిన వారిని పట్టించుకోవడం లేదని పైగా గ్రామంలో నివాసం ఉండాల్సిన ఆయన పట్టణంలో ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండడంలేదని పాపటపల్లి గ్రామానికి చెందిన గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

● ఖమ్మానికి చెందిన కొత్తపల్లి శ్రీనివాసరావు, తనకు చింతకాని మండలం పాతర్లపాడులో సర్వేనెంబరు 19, 19/ఇ లో 2.04 కుంటల భూమి ఉందని పట్టాదారు కాలంలో, అనుభవదారుని కాలంలో తన తండ్రి పేరుకు బదులుగా ఇతరుల పేర్లు ఉన్నాయని వీటిని సవరించాలంటూ అదనపు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశాడు.

● సత్తుపల్లి నుంచి పఠాన్ పాష, తనకు పక్షవాతం వచ్చి, కాలు, చేయి పనిచేయక ఇబ్బందులు పడుతున్నానని తనకు వికలాంగుల పెన్షన్ ఇప్పించాలంటూ అధికారులను వేడుకున్నాడు.

● శ్రీరాంనగర్ రోడ్ నెం.9 నుంచి బత్తుల వెంకటేశ్వర్లు, ధంసలాపురం సర్వే నెం. 55ఈ, 55ఉ, 55ఊ, 55రు, 55రూ, 55లు, 55లో వెంచర్‌లకు లేఅవుట్ పర్మిషన్ ఉన్నది, లేనిదీ తెలియజేసి డాక్యుమెంట్లు ఇప్పించాలంటూ అదనపు కలెక్టర్ సత్యప్రసాద్‌ను కోరాడు. దీనికి స్పందించి డీపీవో తగిన చర్యలు తీసుకోవాలంటూ ఆదేశించారు.


ఫిర్యాదులను స్వీకరిస్తున్న అధికారులు

సోమవారం ఒక్కరోజే ధరణిపై 60 దరఖాస్తులు..

ఇలా భూ సమస్యలపై ప్రతి సోమవారం ప్రజావాణిని ఆశ్రయిస్తున్న బాధితుల సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోంది. ధరణి ప్రారంభం అయినప్పటి నుంచి జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ అనేక సమస్యలకు సుమోటోగా కూడా పరిష్కారాన్ని చూపినప్పటికీ క్షేత్రస్థాయిలో, మండల స్థాయిలో సమస్యలపై జిల్లా అధికారులకు ప్రతి నిత్యం సమస్యలు వచ్చిపడుతున్నాయి. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి సుమారు 102 దరఖాస్తులు అందితే వాటిలో 60కిపైగా ధరణి సమస్యలు.. భూ సమస్యలే ఉన్నట్టు తెలుస్తోంది. ఈ చిన్నచిన్న సమస్యలను కూడా మండలస్థాయిలో రెవెన్యూ అధికారులు చొరవ చూపకపోవడంతో జఠిలంగా మారి జిల్లా కేంద్రానికి అధికారుల దృష్టికి తీసుకురావాల్సి వస్తోంది.

విద్య కోసం వితరణ

(5వ పేజీ తరువాయి)

గ్రామ ప్రముఖులు తపించారు. ఈలోపే వెంకయ్యచౌదరి అనారోగ్యంతో మృతి చెందారు. దాంతో 1992లో మధిర ఎమ్మెల్యేగా ఉన్న బోడేపూడి వెంకటేశ్వరరావు ప్రత్యేక చొరవతో మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు ఇతర గ్రామ ప్రముఖులను సమావేశపరిచి అమెరికాలో ఉంటున్న వెంకయ్యచౌదరి కుమారుడు కొండబోలు రవికుమార్ ఇతర ఎన్నారైలు, స్థానికుల సహకారంతో కొండబోలు వెంకయ్యచౌదరి మెమోరియల్ ట్రస్టు పేరిట డిగ్రీ కళాశాల ఏర్పాటు చేశారు. విరాళాల ద్వారా సేకరించిన భూములను ఈ ట్రస్టుకు స్వాధీనం చేశారు. మూడేళ్లపాటు ప్రైవేట్ భవనాల్లో కేవీసీఎం డిగ్రీ కాలేజీని నిర్వహించారు. ఆ తర్వాత ఈ భూముల్లో అధునాతన రీతిలో డిగ్రీ కళాశాల భవనాలు నిర్మించారు. 1992నుంచి 2009వరకు డిగ్రీ కళాశాల కొనసాగింది. కొన్ని అనివార్య కారణాలతో డిగ్రీ కళాశాల మూతపడింది. ఆ తర్వాత రెండేళ్లకు అంటే 2011లో కేవీసీఎం ఎన్నారై పాలిటెక్నిక్ కాలేజీని ప్రారంభించారు. 2015వరకు ఈ కళాశాల నడిచింది. ఇక ఆ తర్వాత ఈ పాలిటెక్నిక్ కళాశాల కూడా మూతపడింది. తొమ్మిదేళ్ల నుంచి కేవీసీఎంకు చెందిన భవనాలు నిరుపయోగంగా ఉన్నా యి.

షరతులతో స్వాధీనం చేసేందుకు నిర్ణయం..

గత తొమ్మిదేళ్ల నుంచి నిరుపయోగంగా ఉన్న భూములు, భవనాలను ప్రభుత్వానికి అప్పగించేందుకు కేవీసీఎం ఎడ్యుకేషనల్ సొసైటీ వారు నిర్ణయించారు. ఈ ఏడాది మార్చి ఐదున ప్రస్తుత ట్రస్టు చైర్మన్ కొండబోలు రవికుమార్ సమక్షంలో జరిగిన సమావేశంలో ఈ ఆస్తులను విద్యా కార్యక్రమాలకు వినియోగించుకొనేందుకుగానూ ప్రభుత్వానికి అప్పగించాలని నిర్ణయించారు. అయితే ఆస్తులు స్వాధీనం చేసేందుకుగానూ కొన్ని షరతులను విధించారు. వాటి ప్రకారం ఈ ఆస్తుల ప్రాంగణంలో ఏ సంస్థలను స్థాపించినా కొండబోలు వెంకయ్యచౌదరి పేరును కొనసాగించాలి. ఇక్కడ ఏర్పాటుచేసిన కొండబోలు వెంకయ్యచౌదరి విగ్రహాన్ని యథాస్థలంలో ఉంచాలి. ఈ భూములు, భవనాలను విద్యా కార్యక్రమాలకు మాత్రమే ఉపయోగించుకోవాలి. ఇతర అవసరాల కోసం వీటి నిఉపయోగించకూడదు. విద్యాసంస్థల చైర్మన్ రవికుమార్ అవసరమైన ఒప్పందాలపై సంతకాలు చేసి అన్ని డాక్యుమెంట్లను అమలుచేసి ఈ స్థిరాస్తులను పూర్తిగా ప్రభుత్వానికి అప్పగించటానికి కమిటీ ఆయనకు అధికారం కట్టబెట్టింది.

స్వాధీనానికి ముందుకొచ్చిన ప్రభుత్వం..

ట్రస్ట్ తీర్మానం ప్రకారం రూ.30కోట్ల విలువైన కేవీసీఎం ట్రస్ట్ ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వం వేగంగా చర్యలు చేపట్టింది. ముందుగా ప్రజా వైద్య అవసరాల కోసం ఈ భవనాలను తాత్కాలికంగా ఉపయోగించుకొని ఆ తర్వాత కమిటీ కోరినట్లు విద్యావసరాలకు వీటిని ఉపయోగించటానికి ప్రభుత్వం నిర్ణయించి చర్యలు చేపట్టింది. ఇక్కడే ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ స్థాయి విద్యాసంస్థలను ఏర్పాటు చేసేందుకు కూడా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగులకు తీపి కబురు

▸▸ 35 నుంచి 40 ఏళ్లకు వయోపరిమితి పెంపు

▸▸ సర్క్యూలర్‌ను జారీ చేసిన యాజమాన్యం ▸▸ 600 మందికి లబ్ధి

రుద్రంపూర్, జూన్ 10: సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న డిఫెండెంట్ ఉద్యోగులకు యాజమాన్యం తీపికబురు అందించింది. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న డిపెండెంట్ల సమస్యను తీర్చింది. వయోపరిమితిని 35 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాలకు పెంచుతూ సోమవారం రాత్రి యాజమాన్యం సర్క్యూలర్‌ను జారీ చేసింది. యాజమాన్యం నిర్ణయంతో సింగరేణి వ్యాప్తంగా 600 మంది డిఫెండెంట్లకు లబ్ధి చేకూరింది. సింగరేణి యాజమాన్యం నిర్ణయంతో డిపెండెంట్ల ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా యాజమాన్యం వయోపరిమితిని పెంచుతూ సర్క్యులర్ జారీ చేయడం పట్ల ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరి జనక్ ప్రసాద్‌లు హర్షం వ్యక్తం చేశారు.

కార్పొరేట్ ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ బృందం పర్యటన

ఇల్లెందు టౌన్, జూన్ 10: సింగరేణి ఇల్లెందు ఏరియాలోని జీకే5 ఓసీ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న పంపుడు స్టోరేజీ పవర్‌ప్లాంట్ నిర్మాణ స్థలాన్ని సోమవారం కార్పొరేట్ ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఏరియా జీఎం జాన్ ఆనంద్ పంపుడు స్టోరేజీ పవర్ ప్లాంట్ కోసం అనువైన స్థలాన్ని చూపించారు. ఈ పంపుడు స్టోరేజీ పవర్‌ప్లాంట్ సహజ వనరులను వినియోగించి విద్యుత్ ఉత్పత్తి చేస్తుందని అధికారులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జీఎం (ప్రాజెంట్‌అండ్ ప్లానింగ్) రవికుమార్, జీఎం (సర్వే) జైనుద్దీన్, ఏజీఎం డీవీ. ప్రసాద్, నటరాజ్, నాగేంద్రకుమార్, ప్రాజెక్టు ఆఫీసర్ బొల్లం వెంకటేశ్వర్లు, ఏరియా ఇంజనీరు నర్సింహరాజు, ఎస్టేట్ అధికారి శివకుమార్, డీజీఎం సర్వే బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.


జేకే ఓసీ ప్రాంతాన్ని పశిలిస్తున్న అధికారులు

పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించాలి

» ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్


వినతిపత్రాలు స్వీకరిస్తున్న పీవో ప్రతీక్‌జైన్

భద్రాచలం, జూన్ 10: వేసవి సెలవులు అనంతరం పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు వారి మానసిక, ఆరోగ్య స్థితిని అంచనా వేసేందుకు తప్పనిసరిగా వైద్య పరీక్షలు నిర్వహించాలని సంబంధిత వార్డెన్, హెచ్‌ఎంలను పీవో ప్రతీక్‌జైన్ ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో గిరిజన దర్బారు ప్రారంభానికి ముందు సంబంధిత యూనిట్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం వివిధ సమస్యల గురించి గిరిజనుల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్‌రాజు, డీడీ మణెమ్మ, ఏడీఎంహెచ్‌వో భాస్కర్, ఆర్వోఎఫ్ఆర్ శ్రీనివాస్, ఏపీవో పవర్ మునీర్‌పాషా, డీఎస్‌వో ప్రభాకర్‌రావు, మేనేజరు ఆదినారాయణ, ఎస్‌డీసీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంలోని గిరిజన బీఈడీ కళాశాల ఫైనల్ సెమిస్టర్ ఫలితాల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పీవో ప్రతీక్‌జైన్ తెలిపారు. 94 మంది విద్యార్థులు హాజరు కాగా అందులో 7.79 సీజీపీతో కొప్పు మౌనిక ప్రథమ స్థానంలో, 7.76 సీజీపీతో వాంకుడోతు సంతోష్‌కుమార్ ద్వితీయ స్థానంలో, 7.68 సీజీపీఏతో పూనెం తనుజ తృతీయ స్థానం సాధించారని తెలిపారు. యూనివర్సిటీస్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేసిన కళాశాల ప్రిన్సిపాల్ వీరునాయక్‌ను అధ్యాపకులకు, డీడీ మణెమ్మతో పాటు ఆయన అభినందనలు తెలిపారు.



మళ్లీ వరదల భయం..

» వానాకాలం మొదలుకావడంతో గోదావరి తీర వాసుల్లో గుబులు
» ఇంకా మొదలు కాని ముందస్తు సమీక్షలు
» భద్రాచలం రామాలయ పరిసరాలకు ముంపు భయం
» గత ఏడాది జూలై 30న 56.1 అడుగుల నీటిమట్టం నమోదు
» ఇరు రాష్ట్రాల అధికారుల మధ్య సమన్వయమే కీలకం

భద్రాచలం, జూన్ 10: గోదావరి నది పరీవాహక ప్రాంతవాసులకు మళ్లీ వరదల భయం ప్రారంభమవుతోంది. ఎందుకంటే ఇప్పటికే జూన్ నెల వచ్చేసింది. భద్రాచలం ఏజెన్సీలోని గోదావరి నదీ పరివాహక ప్రాంతవాసులకు ప్రతి ఏటా వరదల భయం ఉంటూనే ఉంటుంది. జూలై, ఆగస్టు, సెప్టెంబరు ఈ మూడు నెలలు వరదల సమయంలో ఎంతో కీలకమని చెప్పక తప్పదు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా అప్రమత్తత లోపించినా భారీ ప్రమాదం పొంచి ఉండే అవకాశాలు మెండుగా ఉంటాయి.

ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం, అధికార యంత్రాంగం రాబోయే వర్షాకాలంలో మూడు నెలలు వరదలకు ఎంతో కీలకం కావడంతో పూర్తిస్థాయి అప్రమత్తత ఎంతో అవసరం. దీనిపై అధికార యంత్రాంగం జూన్ నెల ఆరంభమైనా ఇంకా సమీక్ష నిర్వహించలేదు.

జూలైలోనే వరదల భయం.....

గత కొన్ని దశాబ్దాలుగా వరదలు అత్యధికంగా ఆగస్టు నెలలోనే రావడం ఉండేది. కాని ఇటీవల కాలంలో వరదలు జూలై నెలలోనే వస్తుండటంతో నదీ పరివాహక ప్రాంతవాసు ల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. 1990లో 70.8 అడుగుల గోదావరి నీటిమట్టం నమోదైన 32 ఏళ్లకు మళ్లీ 2022 జూలై 16న 71.3 అడుగులకు చేరుకొని భద్రాద్రి ఏజెన్సీ జనజీవనాన్ని అతలాకుతలం చేసింది. 79 గ్రామాలు వరద ముంపునకు గురికాగా 15,465 కు టుంబాలకు చెందిన 21 వేల మంది నిర్వాసితులు 77 పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్నారు. వరద ప్రభావిత గ్రా మాలు వ్యవసాయపరంగా 99 గుర్తించగా 10,831 ఎకరాల్లో పంటనష్టం చోటు చేసుకుంది. 5,047 మం ది రైతులు వరదల కారణంగా నష్టపోయారని అధికారులే గుర్తించారు. 2023 జూలై 30న భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 56.1అడుగులు నమోదైంది. ఈ సమయంలో భద్రాచలం వద్ద 15,96,899 క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవహించిం ది. దీంతో 82 గ్రామాలపై ఈ ప్రభావం పడగా, 3,056 మందిని సురక్షిత ప్రాంతాలకు ముందస్తుగా తరలించారు.

మూడు నెలలు కీలకం....

రాబోయే మూడు నెలలు గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలకు అధికారులకు ఎంతో కీలకమైన సమయం. ఎందుకంటే ప్రస్తు తం ఇసుక తిన్నెలు, దిబ్బలు, రాళ్లగుట్టలతో దర్శనమిస్తున్న గోదావరి జూలై నుంచి సెప్టెంబరు వరకు ఉగ్రరూపంతో ప్రవహించే అవకాశాలు ఉంటాయి. ఈ సమయంలో రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఉన్నతాధికారుల మధ్య సమన్వయం అత్యంత కీలకం. ఇందు కోసం జూన్ ఆరంభంలోనే జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి కసరత్తు చేపట్టాలి. రాబోయే మూడు నెలలు వరదలు, వ్యాధులపరంగా ఎంతో కీలకం కావడంతో అధికార యంత్రాంగం ఆ దిశగా ముందు నుంచి కసరత్తు చేపట్టాల్సి ఉంది. మూడు నెలల పాటు డిప్యుటేషన్‌పై నియమించేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. అలాగే ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో సురక్షిత ప్రాంతాలను గుర్తించి అక్కడ బియ్యం, పప్పులు, నూనె తదితర నిత్యవసర సరుకులను బఫర్ స్టాక్‌గా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

ముంపు ఈసారైనా తప్పేనా!

వరదల సమయం వచ్చిందంటే రామాలయ పరిసరాలు ముంపునకు గురవుతున్న సందర్భాలు కోకొల్లలు. ప్రతి ఏటా భద్రాచలంలోని విస్తా కాంప్లెక్సు స్లూయిస్ సమీపంలో ఉన్న రామాలయ పరిసరాలు, దేవస్థానం ఉచిత నిత్యాన్నదాన సత్రం, చప్టా దిగువ, అలాగే అశోకనగర్ కొత్తకాలనీలో ఉన్న స్లూయిస్ సమీపంలో ఉన్న కాలనీవాసులు ముంపునకు గురవుతున్నారు. దశాబ్దకాలంగా అప్పటి ప్రభుత్వం సరైన రీతిలో వ్యవహరించకపోవడంతో ముంపు సమస్య వెంటాడిందనే విమర్శలు ఆక్షేపణలు వ్యక్తమయ్యాయి. అయితే ఈసారి ఏ సమస్య రాకుండా ముందస్తుగానే చర్యలు చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొంటున్నారు. స్లూయిస్ గేట్లకు ఆయిలింగ్, గ్రీజింగ్ పనులు చేపట్టనున్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు పేర్కొన్నారు.


గత ఏడాది వరదలకు నీటమునిగిన అశోకనగర్ కొత్తకాలనీ

అదేవిధంగా విస్తాకాంప్లెక్సు వద్ద ఆరు కొత్త మో టారు, నాలుగు పాత మోటార్లు మొత్తం కలిపి 400 హార్స్ పవర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే 250 హెచ్‌పీ సామర్థ్యం గల రెండు మోటార్లు అద్దె ప్రాతిపదికన ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే జిల్లా అధికారులతో నీటిపారుదల శాఖ అధికారులు మాట్లాడినట్లు తెలిసింది. ఇందుకు కలెక్టరు నుంచి సానుకూలత వ్యక్తం కావడంతో త్వరలోనే మోటార్లను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అలాగే కొత్త కాలనీలో గత ఏడాది వరకు 70 హార్స్ పవర్ మోటార్లు ఏర్పాటు చేయగా తాజాగా ఒక 20 హెచ్‌పీ మోటారు, మరో 25 హెచ్‌పీ మోటారు కొత్తగా కొనుగోలు చేశామని వాటిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న కరకట్ట పనులు ....

భద్రాచలం శివారు ప్రాంతంలో 700 మీటర్ల కరకట్ట మిగులు నిర్మాణ పనులు సాగుతున్నాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. మొత్తం రూ.38.045 కోట్ల అంచనా విలువతో చేపట్టిన పనులు నూతన ప్రభుత్వం ఏర్పడిన అనంతరం చేపడుతున్నారు. మొత్తం 11 మీటర్ల ఎత్తుతో ఈ కరకట్టను నిర్మిస్తుండగా ప్రస్తుతం నాలుగు మీటర్లు ఎత్తు నిర్మాణం జరిగిందని అధికారులు తెలిపారు. వరదల సమయం నాటికి మిగిలిన పనులు సైతం వేగంగా చేపట్టనున్నట్లు పేర్కొంటున్నారు.

మహిళా సంఘాలను విస్మరిస్తున్న పాలకులు

ఇల్లెందు టౌన్, జూన్ 10: మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టలేని పాలకులు, మహిళా చట్టాలను విస్మరిస్తున్నారని ప్రగతిశీల మహిళా సంఘం జాతీయ నాయకురాలు వి. సంధ్య విమర్శించారు. సోమవారం ఇల్లెందులో పీవోడబ్ల్యూ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలపై దాడులు, అత్యాచారాలు, వేధింపులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ శిక్షణ తరగతుల్లో టీపీటీఎస్ రాష్ట్ర కార్యదర్శి కవిత, జీవీ. సారయ్య, కౌన్సిలర్ వేళ్ల నాగలక్ష్మి, సంధ్య, భూలక్ష్మి, రాధా, పద్మ, సోముల కళావతి, ఆదిలక్ష్మి, మోకాళ్ల సుగుణ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రగతిశీల మహిళా సంఘం జాతీయ నాయకురాలు సంధ్య

బంగారు పతకాలు సాధించిన వ్యవసాయ కళాశాల విద్యార్థులు

అశ్వారావుపేట రూరల్, జూన్ 10: అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినిలు వివిధ అంశాలలో తమ ప్రతిభను చాటి బంగారు పతకాలు సాధించారు. ఆచార్య జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం 6వ స్నాతకోత్సవం సందర్భంగా విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు పతకాలు అందించారు. బజ్జూరి దివ్య విశ్వవిద్యాలయం స్థాయిలో అత్యధిక ఓవరాల్ గ్రేడ్ పాయింట్‌లు సాధించినందుకు ఆరు పసిడి పతకాలు సాధించారు. పసుపులేటి సాహితి అకడమిక్, కో కర్రిక్యులర్ కార్యకలాపాలలో ప్రతిభ చూపి పతకాలను అందుకున్నారు. విద్యార్థులకు గవర్నర్, విశ్వవిద్యాలయం ఛాన్సలర్ సీపీ రాధాకృష్ణన్ చేతుల మీదుగా పతకాలు అందుకున్నారు.


బంగారు పతకంతో సాహితి

39.5కేజీల గంజాయి స్వాధీనం

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 10: ముళ్ల పొదల్లో మూడు బస్తాల గంజాయిని నిల్వం చేశారన్న సమాచారం మేరకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఖమ్మం నగరానికి భారీగా గంజాయి రవాణా జరిగిందని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సుంకరి రమేశ్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కొత్త బస్టాండ్ వెనుకభాగంలో ముళ్ల పొదల్లో ఉన్న మూడు బస్తాల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇదే ప్రాంతం నుంచి ఎన్నో ఏళ్లుగా గంజాయి వ్యాపారం జరుగుతుందని సమాచారం. ప్రశ్నించిన స్థానికులను సైతం గంజాయి మత్తులో ఉన్న యువత బెదిరింపులకు భయపడ్డారు. స్వాధీనం చేసుకున్న గంజాయి 39.5 కేజీలు ఉందని, ధర రూ.20లక్షల వరకు ఉంటుందని అధికారులు ప్రకటించారు. తనిఖీల్లో బాబు, సుధీర్, హరిష్, వెంకటేష్, విజయ్, హన్మంతరావు, బేబీ, స్వరూప పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న గంజాయితో ఎక్సైజ్‌శాఖ అధికారులు

క్రైం సమాచారం

వాంతులు, విరోచనాలతో రెండేళ్ల బాలుడి మృతి

బోనకల్, జూన్ 10: వాంతులు, విరోచనాలతో రెండేళ్ల బాలుడు మృతి చెందిన సంఘటన బోనకల్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ఎస్టీ కాలనీకి చెందిన జమలయ్య, లావణ్య దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కుమారుడు భరత్(2)కు ఆదివారం అర్ధరాత్రి ఆకస్మాత్తుగా వాంతులు, విరోచనాలు కావడంతో తీవ్ర అస్వస్థతకు లోనయ్యాడు. గ్రామంలో ప్రథమ చికిత్స చేయించిన అనంతరం ఖమ్మంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య సేవలు అందిస్తున్న క్రమంలో మృతి చెందాడు. బాలుడు మృతి చెందడానికి పాము కాటు కారణం కావచ్చునని వైద్యులు చెప్పినట్లు తెలిసింది. బాలుడి మృతితో బంధువులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.


భరత్(ఫైల్)

రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని వ్యక్తి ..

మధిర, జూన్ 10: రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మధిర-మోటమర్రి రైల్వే స్టేషన్ల మధ్య కిలోమీటర్ 526/2-4 వద్ద సోమవారం ఉదయం చోటు చేసుకుంది. మృతి చెందిన వ్యక్తి వయస్సు 32 ఏళ్లు ఉండొచ్చని, అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని మధిర అవుట్ పోస్టు ఇన్‌చార్జి వేణుగోపాలరెడ్డి తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని అన్నం సేవా ఫౌండేషన్ శ్రీనివాసరావు సహాయంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ ఒకరు..

పాల్వంచ, జూన్ 10: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ మండలం కేశవాపురం గ్రామానికి చెందిన అంగోతు వాలియా(67) స్థానికంగా వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొన్నేళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలోనే శనివారం పొలానికి వెళుతున్నానని చెప్పి గడ్డిమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఎంతకూ తండ్రి తిరిగి రాకపోవడంతో కుమారుడు అంగోతు రమేష్ పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ అపస్మారక స్థితిలో ఉన్న తండ్రిని చూసి హుటాహుటిన ఖమ్మం ఆసుపత్రికి తరలించాడు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాదులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఏఎస్ఐ సుధాకర్ తెలిపారు.

గుండెపోటుతో మహిళ....

ఖమ్మం రూరల్, జూన్ 10: గుండెపోటుతో మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కాచిరాగూడెంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపందా ఖమ్మం జిల్లా నాయకుడు మలీదు నాగేశ్వరరావు సతీమణి పద్మ (50) సోమవారం గుండె పోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య రాష్ట్ర నాయకులు గుర్రం అచ్చయ్యలు ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బందెల వెంకయ్య, నాగేశ్వరరావు, నున్నా నాగేశ్వరరావు, దండి సురేష్, మౌలానా, ఐలయ్య నాగభూషణం, పీవై పుల్లయ్య నంద్రా ప్రసాద్, పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



భద్రాచలం, జూన్ 10: భద్రాచలంలోని దేవస్థానం నిత్యాన్నదాన సత్రం వద్ద గుర్తు తెలియని మృతదేహాన్ని సోమవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు నలుపురంగు ప్యాంటు, లేత ఆకుపచ్చ, తెలుపు రంగు బనియన్ వేసుకొని ఉన్నాడు. వయస్సు సుమారు 50 ఏళ్లు ఉంటుందని, ఆచూకీ తెలిసిన వారు 87126 82160 భద్రాచలం పోలీసులను సంప్రదించాలని పోలీసులు తెలిపారు. కాగా ఈ వ్యక్తి తోపుడు బండిపై అటుకులు అమ్మేవాడని కొందరు స్థానికులు పేర్కొంటున్నారు.

పోక్సో కేసు నమోదు

దమ్మపేట, జూన్10: మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికను వేధిస్తున్న యువకుడిపై దమ్మపేట పోలీసులు సోమవారం పోక్సో కేసు నమోదు చేశారు. మైనర్ బాలికను అదే గ్రామానికి చెందిన రమేష్ అనే యువకుడు కొంత కాలంగా లైంగికంగా వేధిస్తుండటంతో బాలిక విషయాన్ని తల్లితండ్రులకు తెలిపింది. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

పోలీస్ వాహనాన్ని ఢీకొన్న లారీ

» ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో వాహనం » ముగ్గురికి తీవ్ర గాయాలు

అశ్వారావుపేట రూరల్, జూన్ 10: పశువులను తరలిస్తున్న వాహనాలను పట్టుకునేందుకు పోలీసులు వెళ్లగా అట్టి వాహనాన్ని మరో వాహనం ఢీకొనగా, ఇదే సమయంలో ఆగి ఉన్న వాహనాన్ని మరో లారీ ఢీకొనగా ముగ్గురికి గాయాలైన సంఘటన అశ్వారావుపేటలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. అశ్వారావుపేట సరిహద్దు చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, ఆవులను తరలిస్తున్న డీసీఎంను నిలపగా మరో రెండు వాహనాలు ఆపకుండా వెళ్లాయి. అయితే పోలీసులు పెట్రోలింగ్ వాహనంలో వెంబడించారు. ఇదే క్రమంలో నారంవారిగూడెం వద్ద వెనుక నుంచి వచ్చిన లారీ పోలీసు వాహనాన్ని ఢీకొనగా వాహనం స్వల్పంగా దెబ్బతిన్నది. అట్టి వాహనాన్ని పోలీసులు ఆపి మాట్లాడుతుండగా వెనుక నుంచి కెమికల్ వ్యాన్ వేగంగా వచ్చి ఢీకొంది.

ప్రమాదంలో డీసీఎం వ్యాన్ డ్రైవర్ కె.శ్రీను, వ్యానులో ఉన్న నరసింహరావు, బాబురావుకు తీవ్రంగా గాయాలయ్యాయి. ముగ్గురు వాహనంలోనే ఇరుక్కుపోయారు. పోలీసులు వెంటనే క్యాబిన్‌లో ఇరుక్కున్న వారిని బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహన డ్రైవర్ శ్రీనుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మో'డల్' మార్కెట్లు

» ఖమ్మం నగరంలో సమీకృత మార్కెట్‌ల వెల వెల
» సరైన ప్రచారం లేక నెరవేరని లక్ష్యం
» అద్దెల వసూళ్లూ అంతంత మాత్రమే
» మనుగడపై అధికారులు పట్టించుకోవాలంటున్నరైతులు

ఖమ్మంమార్కెట్ , జూన్ 10: వినియోగదారులకు సరసమైన ధరలకు తాజా కూరగాయలను, మాంసాహారాన్ని ఒకే చోట అందించాలన్న ఉద్దేశ్యంతో కోట్లాది రూపాయల ప్రజా ధనంతో నగరంలో రోల్‌మోడల్‌గా నిర్మించిన రెండు సమీకృత మార్కెట్లలో వ్యాపారాలు సరిగ్గా సాగక రైతులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. సదరు మార్కెట్‌లలో వ్యాపారాలు సజావుగా సాగితే ప్రభుత్వానికి సైతం అద్దెల రూపంలో ఆదాయం భారీగా వచ్చే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. అంతే కాకుండా ఆయా మోడల్ మార్కెట్లను మున్సిపల్ కార్పొరేషన్ నిధులతో నిర్మించి నిర్వహణను, అద్దెల వసూళ్లను మార్కెటింగ్ శాఖకు అప్పగించడంతో కేవలం మార్కెటింగ్ శాఖ అధికారులు అద్దెల వసూలుకు ప్రాధాన్యం ఇస్తున్నారే తప్ప ఆయా మార్కెట్లను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవట్లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఆయా మార్కెట్‌లో అద్దెలు ముక్కుపిండి వసూలు చేయడంతో రైతులు, వ్యాపారులు సరసమైన తక్కువ ధరలకు వినియోగదారులకు కూరగాయలను విక్రయించలేక పోతున్నామని వాపోతున్నారు. ఒకవైపు వ్యాపారాలు సజావుగా జరగక పోగా మరోవైపు అమ్మకానికి తెచ్చిన కూరగాయలు అమ్ముడు పోక పారబోయాల్సి వస్తుండటంతో తాము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు, వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.


నూతన బస్టాండ్ వద్ద ఉన్న సమీకృత మార్కెట్‌లో మూసివేసిన దుకాణాల సముదాయాలు

అమ్మకాలు లేక వెల వెల...

వినియోగదారులకు పూలు, పండ్లు, కూరగాయలు, మాంసం, కిరాణా సరుకులు ఒకే చోట లభించాలనే లక్ష్యంతో మోడల్ మార్కెట్‌గా ఉండాలని ఇంటగ్రేటెడ్ మార్కెట్‌లను గత ప్రభుత్వం నిర్మించింది. అందులో భాగంగానే నగరంలోని నూతన బస్టాండ్ వద్ద సుమారు రూ. 6 కోట్లు నిధులతో ఒక మార్కెట్, బ్యాంక్ కాలనీ టీడీపీ ఆఫీసు వద్ద మరో ఇంటగ్రేటెడ్ మార్కెట్‌ను రూ. 10 కోట్లకు పైగా నిధులతో నిర్మించారు. ఆయా మార్కెట్‌లు నిర్మించి అలా గాలికి వదిలేయడంతో వినియోగదారుల మన్నన కోల్పోయిందని, వెరసి కొనుగోళ్లు లేక మార్కెట్ నిర్మానుష్యంగా తయారైందని విమర్శలు వినిపిస్తున్నాయి. నూతన బస్టాండ్ వద్ద నిర్మించిన సమీకృత మార్కెట్‌కు అక్కడ మార్కెట్ ఉందని వినియోగదారులకు తెలియచెప్పేందుకు కనీసం బైపాస్ రోడ్డుపై ఒక ప్రచార బోర్డు, ఆర్చీ వంటి నిర్మాణం సైతం ఏర్పాటు చేయలేదని దీంతో వినియోగదారులకు మార్కెట్ ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి ఏర్పడిందని పలువురు ఆరోపిస్తున్నారు. కనీసం ఇంతవరకు అక్కడ మార్కెట్ ఉందని తమకు తెలియదని కొందరు వినియోగదారులు పేర్కొనడం విశేషం. అంతే కాకుండా బ్యాంక్ కాలనీ ఇంటగ్రేటెడ్ మార్కెట్‌లో ఒక కూరగాయల స్టాళ్లలో తప్ప నాన్‌వెజ్ మార్కెట్‌లో కొనుగోళ్లు లేక వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆయా మార్కెట్‌లలో నిర్వహణ భారమై చాలా దుకాణాలను మూసి వేస్తుండటం విశేషం.


బ్యాంక్‌కాలనీ సమీకృత మార్కెట్ గేటుకు తాళం వేసిన దృశ్యం

అద్దెల వసూలు అంతంత మాత్రమే...

కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన మోడల్ ఇంటగ్రేటెడ్ మార్కెట్‌లో అద్దెల వసూలు సైతం సగానికి సగం మాత్రమే వసూలవుతుండటం విశేషం. నూతన బస్టాండ్ వద్ద ఉన్న సమీకృత మార్కెట్‌లో ఉన్న సుమారు 130 కూరగాయల స్టాళ్లకు, 35 షట్టర్లకు గాను నెలకు సుమారు రూ. 1.20 లక్షలు అద్దెలు రావాల్సి ఉండగా కేవలం 60 వేలు మాత్రమే వసూలవుతున్నాయి. అంతే కాకుండా బ్యాంక్ కాలనీ టీడీపీ ఆఫీసు వద్ద మరో ఇంటగ్రేటెడ్ మార్కెట్‌లో 130 కూరగాయల స్టాళ్లకు, నాన్‌వెజ్ మార్కెట్‌లోని 26 స్టాళ్లకు గాను రూ. 1.30 లక్షలు అద్దెల రూపేణా రావాల్సి ఉండగా ప్రస్తుతం నెలకు రూ. 60 వేల నుంచి రూ. 70 వేల వరకు మాత్రమే వస్తుందని మార్కెటింగ్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

రెండు పూరిళ్లు దగ్ధం

ఏన్కూరు, జూన్10: అగ్ని ప్రమాదంలో రెండు పూరిళ్లు, వరిగడ్డి వామి దగ్ధమైన సంఘటన మండలంలోని తూతక్కలింగన్నపేట గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకా రం.. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రేసు వెంకయ్య, వాగబోయిన కృష్ణ, సాంబయ్య బుచ్చమ్మ నాలుగు కుటుంబాల వారు ఈ రెండు ఇళ్లల్లో వేర్వేరుగా నివసిస్తున్నారు. రోజు వారీలాగానే అందరు రాత్రి భోజనం చేసి నిద్రపోయారు. కాగా ఆదివారం అర్ధరాత్రి సమయంలో పక్కింట్లో ఉంటున్న నామా వెంకటేశ్వర్లు వెంకయ్య ఇంటిలో మంటలు వస్తున్నాయని చెప్పడంతో వారందరూ భయంతో బయటకు వచ్చి చూసేసరికి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. కొద్దిసేపటికి ఇళ్లలోని రెండు గ్యాస్ సిలిండర్లు పేలిపో యాయి. స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నించినప్పటికి అదుపులోకి రాలేదు. వెంటనే ఫైరింజన్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు మంటలను ఆర్పివేశారు. విద్యుదాఘాతం వల్లే ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు సోమవారం సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.10లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు.


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే

అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అన్నారు. సోమవారం తూతక్కలింగన్నపేటలో అగ్నిప్రమాదానికి గురైన ఇళ్లను సందర్శించి, బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. పక్కాగృహాలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అగ్నిప్రమాదంలో కాలిపోయిన పాస్ పుస్తకాలను వెంటనే కొత్త వాటిని మంజూరు చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట మండల అధ్యక్షుడు స్వర్ణనరేంద్రకుమార్, ఏబ్లాక్ అధ్యక్షుడు వేముల కృష్ణ ప్రసాద్, ఎంపీపీ ఉపాధ్యక్షుడు పాశం శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ బానోతు వీరభద్రం, నాయకులు మేడ ధర్మారావు, వక్కంతుల నాగార్జున, గిద్దగిరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు..

అనుమానాస్పదంగా వృద్ధురాలి మృతి

» ఎక్సైజ్ సిబ్బంది దాడితోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యుల ఆరోపణ

జూలూరుపాడు, జూన్ 10: అనుమానాస్పదంగా వృద్దురాలి మృతి చెందిన సంఘటన మండలంలోని దుబ్బతండాలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దుబ్బతండా గ్రామానికి చెందిన బాణోత్ తులసి (65) అనే వృద్ధురాలి ఇంటికి సోమవారం ఉదయం ఎక్సైజ్ ఎస్ఐ విజేందర్, మరికొంత మంది సిబ్బంది వచ్చారు. ఆమె ఇంట్లో, ఆవరణలో సోదాలు చేయగా నాటుసారా తయారు చేసే వస్తువులు, కొంత నాటుసారా పట్టుబడింది. దీంతో ఎక్సైజ్ సిబ్బంది వస్తువులను ధ్వంసం చేసి, నాటుసారాను స్వాధీనం చేసుకొని తీసుకువెళుతున్నారు. ఈ క్రమంలో సదరు వృద్దురాలు వారి వాహనం వద్దకు వచ్చి తాను సారా విక్రయించడం లేదని, తాగేందుకు తయారు చేసుకున్నానని, ఆ సారాను ఇచ్చివేయాలని ఎక్సైజ్ సిబ్బందిని కోరింది. దీంతో వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా, సిబ్బంది ఆమెను పక్కకు తోయటంతో కింద పడిపోయి స్పృహ కోల్పోయింది. వెంటనే వృద్దురాలు మనవడు నరేష్, గ్రామస్థులు వృద్దురాలిని ఇంట్లోకి తీసుకెళ్లారు. కాగా మహిళ ఎక్సైజ్ కానిస్టేబుల్ ఆమె ముఖంపై నీళ్లు చల్లినప్పటికి ఆమె స్పృహలోకి రాకపోవడంతో అక్కడ నుంచి ఎక్సైజ్ శాఖ సిబ్బంది వెళ్లిపోయారు.

ఈ క్రమంలో కుటుంబ సభ్యులు వృద్ధురాలిని వెంటనే కాకర్లలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, ఆమెను పరిక్షించిన వైద్యుడు మృతి చెందినట్లు నిర్ధారించినట్లు తెలిపారు. ఎక్సైజ్ సిబ్బంది నెట్టివేయడంతోనే వృద్ధురాలు కిందపడి మృతి చెందిందని కుటుంబ సభ్యులతో పాటు కొంతమంది గ్రామస్థులు ఆరోపించారు. జరిగిన సంఘటనపై కుటుంబ సభ్యులు జూలూరుపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సంఘటన స్థలానికి హెడ్ కానిస్టేబుల్ దయానంద్‌తో పాటు సిబ్బంది చేరుకొని వివరాలను నమోదు చేసుకున్నారు. ఎక్సైజ్ సిబ్బంది నిర్వాకం వల్లనే ఆమె మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టానికి తరలించేందుకు ప్రయత్నించగా, తమకు న్యాయం చేసిన తరువాతే తరలించాలని వారు తెలిపారు. దీంతో పోలీసులు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో, కుటుంబ సభ్యులు మృతదేహాన్ని కొత్తగూడెంలోని మార్చురీకి తరలించారు.


కుటుంబసభ్యుల నుంచి వివరాలను సేకరిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్‌లో తులసి మృతదేహం)

ఎక్సైజ్ సిబ్బందిపై నేపం మోపడం తగదు: ఎక్సైజ్ సీఐ జయశ్రీ

వృద్ధురాలు మృతితో ఎక్సైజ్ సిబ్బందికి ఎలాంటి సంబంధం లేదని, కావలనే ఆమె కుటుంబ సభ్యులు తమ సిబ్బందిపై నేపాన్ని మోపుతున్నారని కొత్తగూడెం ఎక్సైజ్ సీఐ జయశ్రీ తెలిపారు. వృద్ధురాలు బాణోత్ తులసి ఇంటి ఆవరణలో ఆమె మనవడు నరేష్ సారా తయారు చేసి విక్రయిస్తున్నాడని సమాచారం రావడంతో తమ సిబ్బంది దుబ్బతండా వెళ్లి సోదాలు చేశారన్నారు. ఆమె ఇంటి ఆవరణలో 100 లీటర్ల బెల్లం పానకం, 4 లీటర్ల సారాను తమ సిబ్బంది స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తమ సిబ్బంది వృద్ధురాలును నెట్టలేదని, కావలనే ఆమె కుటుంబ సభ్యులు ఎక్సైజ్ సిబ్బందిపై ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. మనువడు నరేష్‌పై కేసు పెట్టకుండా ఉండేందుకే వారు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు.



ఉపాధి హామీ అవకతవకలపై ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

చర్ల, జూన్ 10: చర్ల మండలం గొంపల్లి పంచాయతీ ఉపాధి పనుల్లో జరిగిన అవకతవకలపై సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేసినట్లు చర్ల సీపీఐఎంఎల్ మాస్‌లైన్ పార్టీ మండల కార్యదర్శి కొండా కౌషిక్ తెలిపారు. ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గొంపల్లి పంచాయతీలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో తప్పుడు పద్దులు వేశారన్నారు. పనులు చేయకుండానే బిల్లులు విడుదల చేశారన్నారు. ఇలా సుమారు మూడు లక్షల నిధులు పక్కదారి పట్టాయని ఆరోపించారు. అధికారులు విచారణ జరిపించి వారంలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. సీపీఐఎంఎల్ పార్టీ డివిజన్ నాయకులు కొండా చరణ్, చెన్నం మోహన్, గ్రామస్థులు పున్నారావు, వెంకటరమణ, బాబూరావు, నర్సింహమూర్తి, నగేష్, సీత, మంగవేణి, నాగమణి, శోభారాణి తదితరులు ఉన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్

- ఇల్లెందు ఏడీఏ వాసవిరాణి
- జూలూరుపాడు, సుజాతనగర్‌లో విత్తన దుకాణాల్లో తనిఖీలు


జూలూరుపాడులో తనిఖీలు నిర్వహిస్తున్న ఏడీఏ

జూలూరుపాడు/సుజాతనగర్ జూన్ 10: వ్యాపారులు, ఎవరైన వ్యక్తులు గ్రామాలలో రైతులకు నకిలీ విత్తనాలను విక్రయించినట్లయితే వారిపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని ఇల్లెందు ఏడీఏ, జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యురాలు పి.వాసవీరాణి హెచ్చరించారు. సోమవారం ఆమె మండల వ్యవసాయశాఖ అధికారి రఘుదీపికతో కలసి జూలూరుపాడులోని విత్తన, ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. విత్తనాలకు సంబంధించిన పత్రాలు, లైసెన్స్‌లు, రికార్డులను, నిల్వలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అనుమతిపొందిన విత్తనాలనే వ్యాపారులు రైతులకు విక్రయించాలని సూచించారు. విత్తనాల కొనుగోళ్ల సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. రైతులు ఒకే రకానికి చెందిన విత్తనాలను మాత్రమే విత్తకుండా రెండు మూడు రకాల కంపెనీలకు చెందిన విత్తనాలను నాటి అధిక దిగుబడులను సాధించాలని తెలిపారు.

స్టాక్ రిజిస్టర్‌లో విత్తనాల నమోదు తప్పనిసరి

సుజాతనగర్: మండలంలోని పలు విత్తన దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ అధికారిణి, ఇల్లెందు ఏడీఏ వాసవీరాణి సోమవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో భాగంగా పలు విత్తన దుకాణాల్లో విత్తనాల ప్యాకెట్లను, స్టాక్ బుక్‌లో వాటి నమోదును పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ చాలా రకాల విత్తనాలను డీలర్లు అమ్ముతున్నారని గుర్తించామని, ప్రతి రకాన్ని స్టాక్ బుక్‌లో నమోదు చేసి వాటి అధికారిక పత్ర నఖలును సదరు మండల అధికారికి అప్పగించాలని, ప్రతిరోజు ప్రతి విత్తన దుకాణంలోని స్టాక్‌ను సదరు మండల అధికారి తప్పక చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి నర్మద, డీలర్లు రామరాజు, సత్తార్‌మియా పాల్గొన్నారు.

విత్తనదుకాణాల్లో వ్యయసాయశాఖ అధికారుల తనిఖీలు

ఇల్లెందు టౌన్ : విత్తనాలు, ఎరువులు దుకాణాల్లో వ్యవసాయశాఖ అధికారులు సోమవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఫెర్టిలైజర్ దుకాణాల్లో కొత్తగూడెం ఏడీఏ రమేష్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని, విత్తనాలను అధిక రేట్లకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాల అమ్మకాల బిల్లులు తప్పని ఇవ్వాలని, స్టాక్ నిల్వలను బోర్డులో సూచించారులని దుకాణా యజమానులను కోరారు. ఎలాంటి ఫిర్యాదులు వచ్చిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు ఏవో సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఖరీఫ్‌కి సిద్ధం

- ఏజెన్సీలో జోరుగా కురుస్తున్న జల్లులు
- పూర్తయిన వేసవి దుక్కులు
- విత్తనాలు, పెట్టుబడుల కోసం రైతుల పరుగులు
- వ్యవసాయ పనుల్లో అన్నదాత

చర్ల, జూన్ 10: గత వానాకాలం సీజన్‌ను అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈఏడాది అన్నదాత వ్యవసాయానికి సిద్ధం అయ్యాడు. భద్రాద్రి ఏజెన్సీలో వర్షాలు కురుస్తుండంతో కోటి ఆశలతో వ్యవసాయ పనులు ప్రారంభించారు. ఇప్పటికే వేసవి దుక్కులు పూర్తికాగా, విత్తనాలు, పెట్టుబడుల కోసం రైతులు పరుగులు పెడుతున్నారు. ఈ ఏడాదైనా అధిక దిగుబడులు సాధించాలని ముందుగు సాగుతున్నాడు.

చర్ల మండలంలో అధిక సాగు

భద్రాచలం డివిజన్ లోని చర్ల మండలంలో ప్రతీ ఏడాది అత్యధికంగా వరి పంటను సాగు చేస్తారు. పోడు భూములు, పట్టా భూములు కలుపుకుని సుమారు 18 వేల ఎకరాల్లో పంటను పండిస్తారు. మండలం లోని పెద్ద మిడిసిలేరు, చిన్న మిడిసిలేరు, చర్ల, తిప్పాపురం, పూసుగుప్ప, కుర్నపల్లి, సత్యనారాయణ పురం, ఆర్ కొత్తగూడెం, కుదునూరు, తేగడ, దోసిళ్ళ పల్లి, గొంపల్లి, కొత్తూరు, కలివేరు, సుబ్బంపేట తోపాటు మరికొన్ని గ్రామాల్లో ఈ సాగు అధికంగా ఉంటుంది. రైతులు దుక్కులు దున్ని విత్తనాలను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే చిరు జల్లులు కురుస్తున్నాయి. ఏదైనా భారీ వర్షం పడితే విత్తనాలు జల్లనున్నారు.

మరో 10 రోజుల్లో వర్షాలు

ఈ ఏడాది రాష్ట్రంలోని రుతుపవనాలు ముందుగానే వస్తాయని వాతావరణ శాఖ చెబుతోంది. గత వారం రోజులు గా మండలంలో జల్లులుతో కూడిన వర్షాలు పడుతున్నాయి. పంటపొలాల్లో నీరు నిలుస్తుండడంతో వరి సాగుకు అనువుగా పొలాలు సిద్ధం అయ్యాయి. చెరువులు, కుంటల్లోకూడా అక్కడ అక్కడ నీరు కనిపిస్తోంది. మరో వారంలో భారీ వర్షాలు పడితే ఖరీఫ్ ఊపందు కోనుంది. రైతులు కూడా వ్యవసాయ పనుల్లో నిమగ్నం కానున్నారు.



అప్పుల కోసం అన్నదాతల పరుగులు

వ్యవసాయంలో ప్రతీ ఏడాది నష్టాలు వచ్చినా అన్నదాత మాత్రం, వ్యవసాయం వైపునే మొగ్గు చూపుతున్నాడు. నష్టాలు వస్తున్నా భూమిని నమ్ముకుంటూ దేవుడిపై భారం వేస్తున్నాడు. నేడు జల్లులు పడుతుండడంతో వ్యవసాయం చేసేందుకు ప్రైవేట్ వ్యాపారులను అశ్రయిస్తున్నాడు. అలాగే బ్యాంకుల చుటూ తిరుగుతూ అప్పు అడుగు తున్నాడు. కాగా ఇదే క్రమంలో అధిక వడ్డీలకు నగదు ఇచ్చి కొంత మంది వ్యాపారులు రైతులను మోసం చేస్తున్నారు.

బీసీ వసతిగృహంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

దుమ్ముగూడెం జూన్ 10: దుమ్ముగూడెం ప్రభుత్వ బీసీ బాలికల వసతిగృహంలో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బీసీ వెల్ఫేర్ అధికారి అరుణ సోమవారం తెలిపారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో 3 నుంచి 10వ తరగతి చదివే అర్హత గల విద్యార్థినులు ఉచిత వసతి పొందే అవకాశం ఉందన్నారు. మెరుగైన భోజన, నివాస సదుపాయాలతోపాటు పాఠ్య పుస్తకాలు, స్టడీ మెటీరియల్, యూనిఫాం, ప్రత్యేక విద్యాబోధన సదుపాయాలుంటాయని తెలిపారు.

నీట్ పేపర్ లీకేజ్‌పై సమగ్ర విచారణ జరిపించాలి

జూలూరుపాడు, జూన్ 10: విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం ఆడుకుంటుందని, నీట్ పేపర్ లీకేజ్‌పై సమగ్ర విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయకార్యదర్శి గుగులోత్ వంశీ డిమాండ్ చేశారు. సోమవారం జూలూరుపాడులో ఆయన విలేకర్లతో ఆయన మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై విచారణ జరిపి కేంద్ర ప్రభుత్వం మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని కోరారు.

మిషన్ భగీరథ ఇంటింటి సర్వే

అన్నపురెడ్డిపల్లి/చుంచుపల్లి జూన్ 10: మండలంలోని పది పంచాయతీల్లో మిషన్ భగీరథ ఇంటింటి సర్వేని పంచాయతీ కార్యదర్శులు సోమవారం ప్రారంభించారు. పంచాయతీల పరిధిలోని గ్రామాల్లోని లబ్దిదారుల ఇళ్లకి వెళ్లి మిషన్ భగీరథ సర్వే యాప్‌లో యజమాని పేరు, ఇంటి నంబర్, చిరునామా, భగీరథ నల్లా ఫోటో లాంటి వివరాలను నమోదు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీఓ మహాలక్ష్మి, ఎంపీఓ షబ్నా తదితరలు పాల్గొన్నారు.

చుంచుపల్లి: మండలంలోని ప్రతి ఇంట్లో నల్లా ఏర్పాటు చేసేందుకు ఇంటింట సర్వే నిర్వహిస్తున్నామని చుంచుపల్లి ఎంపిడివో వాసిరెడ్డి అశోక్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని బాబూక్యాంపు, ఎన్‌కెనగర్, చుంచుపల్లితండా, నందాతండా పంచాయతీల్లో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ గ్రామ పంచాయతీలో 400 ఇళ్ల చొప్పున ఈ నల్లా సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వారం రోజుల పాటు జరిగే ఈ సర్వేలో మండల పరిషత్ అధికారులు పాల్గొంటారని ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో చుంచుపల్లి ఎంపివో గుంటి సత్యనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

అన్నపురెడ్డిపల్లి, జూన్ 10: హరిహరక్షేత్రమైన అన్నపురెడ్డిపల్లిలోని శ్రీభ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి దేవాలయంలో సోమవారం పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ప్రదానార్చకులు సత్యనారాయణశర్మ స్వామివారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అబిషేకాలు సాంప్రదాయరీతిలో నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రైతు సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం

దుమ్ముగూడెం జూన్ 10: రైతు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రగతి శీల రైతు సంఘం నాయకులు సోమవారం తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఖరీఫ్ సాగుకోసం విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచాలని, కల్తీ విత్తనాల విక్రయాలపై కఠినచర్యలు చేపట్టాలని, కొత్త రుణాలివ్వాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. నాయకులు వీరభద్రం, సాయన్న, రామిశెట్టి, కన్నయ్య తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించాలని జీసీసీ హామాలీల వినతి

దమ్మపేట, జూన్, 10: గిరిజన సహకార సంస్థలో పని చేస్తున్న హామాలీల సమస్యలు పరిష్కరించాలని మేనేజర్ సుగ్గల నర్సింహారావుకు కార్యాలయంలో సోమవారం హామాలీల సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అంద జేశారు. ఆసంఘం అధ్యక్షుడు బోగి సత్యం మాట్లాడుతు ఎగుమతి దిగుమతి ధరలను 26రూ.ల నుంచి 36 రూ.లుకు పెంచాలని, నాలగవతరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రైవేటు గోదాముల స్థానంలో ప్రభుత్వ గోదాములు నిర్మించాలని, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10లక్షలు ఇవ్వాలని తదితర డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసినవారిలో బోగి నర్సింహారావు, తదితరులు వున్నారు.

వృద్ధులకు అన్నదానం

అశ్వాపురం జూన్ 10: అశ్వాపురం ఎంపీపీ ముత్తినేని సుజాత ఆధ్వర్యంలో అశ్వాపురం, సీతారాంపురం గ్రామాల్లో ఉన్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తన భర్త మండల కాంగ్రెస్ నాయకుడు ముత్తినేని శ్రీనివాసరావు జన్మదినాన్ని పురస్కరించుకుని వృద్ధులకు అన్నదానం చేశారు. అనంతరం స్థానిక సాయిబాబా ఆలయం, మసీద్, చర్చిలలో సర్వమత ప్రార్ధనలు జరిపారు. కార్యక్రమంలో జడ్పీ కోఆప్షన్ సభ్యుడు షర్ఫుద్దీన్, మండల కోఆప్షన్ సభ్యుడు ఖదీర్, యువజన నాయకులు మురళీ, రమేష్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో పాలు, పండ్ల పంపిణీ

మణుగూరు/అశ్వాపురం, జూన్ 10: అశ్వాపురం మండల పరిధిలోని ఆరీషా అండ్ రోషీ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఎస్‌కేటీ గ్రూప్స్ డైరెక్టర్ దోసపాటి పిచ్చేశ్వరరావు సోమవారం పాలు, పండ్లు, బ్రేడ్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడారు. తన పుట్టినరోజును వృద్ధులతో కలసి నిర్వహించుకోవాలనుకున్నాని, ఆశ్రమంలోని నిర్వహించుకున్నట్లు పేర్కొన్నారు. ఆశ్రమానికి ఎళ్లవేళల తమ శక్తి మేరకు సహాయ, సహకారుల అందించామని, అదేవిధంగా ఎళ్లవేళల సహాయ, సహకారాన్ని కొనసాగిస్తనని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌కేటీ గ్రూప్ సభ్యులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

పౌరసరఫరాల శాఖ ఇన్‌చార్జి డీటీగా శ్రీరామ్

భద్రాచలం, జూన్ 10: భద్రాచలం పౌర సరఫరాల శాఖ ఇన్‌చార్జ్ డిప్యూటీ తహసీల్దారుగా భూక్యా శ్రీరామ్‌ను నియమిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న కస్తాల వెంకటేశ్వరరావు పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో ప్రస్తుతం ఇన్‌చార్జి డీటీగా శ్రీరామ్ వ్యవహరించనున్నారు.

నూతన చట్టాలపై పోలీసులకు అవగాహన సదస్సు

భద్రాచలం, జూన్ 10: భద్రాచలం సబ్ డివిజన్ పోలీసు అధికారులకు జూలై నుంచి అమల్లోకి రానున్న నూతన చట్టాలపై నాలుగు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించారు. సోమవారం శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా జరిగిన సభలో ఎఎస్‌పీ పంకజ్ పరితోష్ పాల్గొని శిక్షణలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం ఎఎస్‌పీ మాట్లాడుతూ నూతన చట్టాలపై ప్రతి ఒక్క పోలీసు సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని, వాటి ఆవశ్యకతను గమనించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ పి.నాగరాజు, ఎస్సై పీవీఎన్‌రావు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఐదేళ్ల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలి

కొత్తగూడెం టౌన్, జూన్ 10: మున్సిపల్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు ఐదు సవత్సరాల్లోపు పిల్లలందర్నీ పంపించే విధంగా తల్లిదండ్రులు చొరవ చూపాలని సీడీపీవో అరుణకుమారి కోరారు. సోమవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా 23వ వార్డులో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందించడంతో పాటు, ఆట, పాటలను నిర్వహిస్తున్నట్లు పిల్లలను అంగన్‌వాడీ అలరింపచేస్తారని తెలిపారు. కౌన్సిలర్ వై. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 23వ వార్డులో అంగన్‌వాడీ కేంద్రాలు సజావుగా నడిచే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ శారద, రజిని, సిబ్బంది, బస్తీ పెద్దలు పాల్గొన్నారు.

పట్టాలు మంజూరు చేయాలని కలెక్టర్‌కు వినతి


కలెక్టర్‌కు సమస్య వివరిస్తున్న రేగళ్ల రైతులు

లక్ష్మీదేవిపల్లి, జూన్ 10: మండల పరిధిలోని రేగళ్ల గ్రామ పంచాయతీలో దొరలకాలం నాటి భూములను ఆ గ్రామ ప్రాంత ప్రజలు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నామని, వాటికి సమకూర్చాల్సిన పట్టాదారు పాస్‌పుస్తకాలన ప్రభుత్వం ఇవ్వకపోవడంతో సర్వే నెం: 122లో గల అటవీ భూములను గిరిజనులు సాగు చేసుకుంటున్నామని, వాటికి పట్టా పాస్‌పుస్తకాలు మంజూరుచేయాలని కోరుతూ ఆ ప్రాంత గిరిజనులు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో గిరిజన గ్రీవెన్స్‌డే కలెక్టర్ ప్రియాంక అలకు వినతిపత్రం అందచేశారు. గతంలో ప్రభుత్వ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీస్, ఫారెస్ట్ శాఖల త్రిసభ్యకమిటీ వేసి సుమారు 500పైగా గిరిజన రైతులకు పట్టాదాట్ పాస్‌పుస్తకాలు ఇచ్చేందుకు శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోన నాయకులు అనుయాయులకు మాత్రమే పట్టా పుస్తకాలు పుస్తకాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రేపు, మాపు అంటూ గత కొన్నేళ్లుగా అధికారులు కార్యాలయాల చుట్టు తిప్పించుకుంటు రైతులు ఇబ్బందులు పడుతున్నారని మొరపెట్టుకున్నారు. ఇప్పటికైనపెండింగ్‌లో ఉన్న గిరిజన రైతుల పట్టాదార్‌పాస్‌పుస్తకాలను అందచేయాలని వేడుకుంటున్నారు.

విద్యార్థుల్లో నమోదు శాతాన్ని పెంచాలి: ఎంపీడీవో

జూలూరుపాడు, జూన్ 10: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి నమోదు శాతాన్ని పెంచి పాఠశాలలను బలోపేతం చేయాలని ఎంపీడీవో కరుణాకర్‌రెడ్డి కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం జూలూరుపాడు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాలల హెచ్ఎంలకు ఆయన విద్యార్థుల దుస్తులను అందజేశారు. మండల స్థాయి బడిబాటలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, దుస్తులతో పాటు ఉపకార వేతనాలను అందిస్తామని తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన చేయటంతో పాటు మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి పి.సంజీవరావు, సెర్ప్ ఏపీఎం సత్యనారయణరాజు, సీసీలు డి.నాగేశ్వరరావు, బి.మధు, రామరావు, హెచ్ఎంలు పి.లక్ష్మీనర్సయ్య, ఎస్‌కె.మీరా పాల్గొన్నారు.

తుమ్మల ఆదేశంతో మర్కోడుకు బస్ సర్వీస్ ప్రారంభం


బస్ సర్వీస్ ప్రారంభిస్తున్న ఇల్లెందు డిపో ఇన్‌చార్జ్

ఆళ్లపల్లి, జూన్ 10: వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో సోమవారం ఇల్లెందు నుంచి మర్కోడుకు ఆర్టీసీ బస్సులు ప్రారంభం కావడంతో ఆళ్లపల్లి, మర్కోడు చూట్టుపక్కల పల్లె ప్రయాణికుల నాలుగేళ్ల కళ సోమవారం నెరవేరింది. 2020లో కరోన సమయంలో లాక్ డౌన్‌లో బస్సులు బంద్ చేయగ, తిరిగి ప్రారంభించలేదు. అనంతరం అనేక ధఫాలు ఆర్టీసీ వారికి స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు విన్నవించిన ఫలితం లేకపోవడంతో, ఇటీవలే ఆళ్లపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సమస్యను తుమ్మల దృష్టికి తీసుకెళ్లగా మంత్రి తుమ్మల స్పందించి ఆర్టీసీ ఆర్ఎంతో మాట్లాడి ఇల్లెందు- మర్కోడు బస్ సర్వీస్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దాంతో ఆర్టీసీ అధికారులు సోమవారం ఇల్లందు డిపో నుంచిమర్కోడుకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు. ఇల్లందు డిపో ఇన్‌చార్జ్ సంజీవ రాణి, కాంగ్రెస్ పార్టీ నాయకులు రామనర్సయ్య అతహార్, పడిగసమ్మయ్య, కృష్ణహారి, రమేష్, వెంకన్న, సునిత, గౌరమ్మ, చిరంజీవి, రాము, శేఖర్, కృష్ణ, వెంకటనారాయణ, కృష్ణబాబు, ఆర్టీసి సిబ్బంది మర్కోడులో బస్సు ప్రారంభించారు. ఇల్లందు నుండి బస్సు రావడంతో ఆళ్లపల్లి మండల ప్రయాణికులు హర్షవ్యక్తం చేస్తు తుమ్మలకు కృతజ్ఞతలు తెలిపారు.

పోలీసులే లక్ష్యంగా ఏర్పాటుచేసిన 70 బూబీ ట్రాప్ గుర్తింపు

కొత్తగూడెం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది లక్ష్యంగా మావోయిస్టులు ఏర్పాటు చేసిన బూబీ ట్రాప్‌ను స్పెషల్‌పార్టీ పోలీసులు, గుర్తించారు. చర్ల మండలంలోని పూసుగూడెం అటవీ ప్రాంతం, తెలంగాణ చత్తీష్‌గడ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో చర్ల పోలీసుల ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం స్పెషల్ పార్టీ, చత్తీస్‌గడ్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ పోలీసులు సోమవారం సంయుక్తం నిర్వహించిన ఏరియా డామినేషన్ ఆపరేషన్‌లో నిషేదిత సీపీఐ మావోయిస్టులు సరిహద్దు ప్రాంతాల్లో ఆదివాసీలు, వారికి సంబందించిన జంతువులు సంచరించే ప్రదేశాల్లో అమర్చిన 70 బూబీ ట్రాప్‌ను గుర్తించారు. మావోయిస్టులు తవ్వి ఏర్పాటు చేసిన 70 బూబీ ట్రాప్‌నుంచి 4396 పదునైన ఇనుపు కడ్డీలను తొలగించి వాటిని స్వాదీనం చేసుకున్నారు.

సమ్మర్ ఫుట్‌బాల్ క్యాంపు విజేత ఉజ్వల్ టీం


విజేత జట్టు

భద్రాచలం, జూన్ 10: భద్రాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో నెల రోజులుగా భద్రాచలం ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం సోమవారం ముగిసింది. ఫ్రెండ్లీ మ్యాచ్‌ల్లో 12 జట్లు తలపడగా ఉజ్వల్‌టీం విజేతగా నిలిచింది. అనంతరం వీరికి ట్రాఫిక్ ఎస్ఐ మధు ప్రసాద్ విజేత జట్టుకు జ్ఞాపికలను అందజేశారు. ఎస్ఐ మాట్లాడుతూ క్రీడల ద్వారా శారీక దృడత్వం, మానసిక ఉల్లాసం, క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో బొల్ల వెంకటేశ్వర్లు, ఎఎస్సై శ్రీనివాస్, ఫుట్‌బాల్ కోచ్‌లు క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా:ఎమ్మెల్యే పాయం


వెంకటేశ్వర్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పాయం

బూర్గంపాడు, జూన్ 10: పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం బూర్గంపాడు మండల పరిదిలో పర్యటించారు. మోరంపల్లిబంజరలో ఇటీవల ప్రమాదంలో గాయపడిన మూల వెంకటేశ్వరరెడ్డిని పరామర్శించారు. ప్రమాద వివరాలు తెలుసుకుని అధైర్య పడొద్దు..అండగా ఉంటానని భరోసా కల్పించారు. అనంతరం బూర్గంపాడులో పర్యటించి పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కాంగ్రెస్, సిపిఐ నాయకులు కృష్ణారెడ్డి, సీతారామిరెడ్డి, భజన సతీష్, వెంకటేశ్వర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, నాగరాజు, శనగ కిషోర్, వీరారెడ్డి, సుబ్బారెడ్డి, బ్రహ్మరెడ్డి, రామకొండారెడ్డి, నాగమణి, పాల్గొన్నారు.

ఆదివాసీల సమస్యల పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

అశ్వాపురం జూన్ 10: ఆదివాసీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు మండల ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. మండలంలోని తుమ్మలచెరువు మత్స్య సొసైటీలో ఆదివాసీలను చేర్చాలని, పోడు భూములకు పట్టాలు ఇప్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో జేఏసీ అధ్యక్ష, కార్యదర్శులు కల్లూరి నర్సింహరావు,తోకల చంద్రశేఖర్,నాయకులు తెల్లం వీరభద్రం, మున్నేశ్వరరావు,రామారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఈపీ ఆపరేటర్ల వినతి

మణుగూరుటౌన్, జూన్ 10: ఎన్నికల నేపధ్యంలో విధించిన ఎన్నికల కోడ్ ముగిసినందున వెంటనే ఈపీ ఆపరేటర్ల సమస్యలను పరిష్కరించాలని ఏరియా ఆపరేటర్లు డిమాండ్ చేశారు. సోమవారం ఏరియా ఇన్‌చార్జ్ ఎస్వోటు జీఎం వెంగళరావును ఏరియా ఆపరేటర్లు కలసి వినతి పత్రమందజేశారు. ఆపరేటర్ల నాయకులు ఎస్‌డీ నాసర్‌పాషా మాట్లాడారు. ఈపీ ఆపరేటర్ల పదోన్నతులకు సంబంధించి ఇప్పటికే అర్హత పరీక్షలు నిర్వహించి ఉన్న ఏ, బీ గ్రేడ్ ప్రమోషన్స్ ఆర్డర్ కాపీలు బ్యాక్ డేట్‌తో కలపి అందజేయాలని కోరారు. ఎక్సావేషన్ సీగ్రేడ్ పదోన్నతుల భర్తీకి సత్వర చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్ నరేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత సంపూర్ణ వ్యక్తిత్వ వికాస శిక్షణ

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూన్ 10: ఉచిత సంపూర్ణ వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని స్టూడెంట్స్ టీచర్స్ ఎడ్యుకేటర్స్ పేరెంట్స్(స్టెప్) భద్రాద్రి జిల్లా కో-ఆర్డీనేటర్ జి.సుగుణారావు కోరారు. సోమవారం కొత్తగూడెం ప్రకృతి ఆశ్రమంలో ఏర్పాటు చేసిన స్టెప్ జిల్లా కార్య నిర్వహణ కమిటీ సమావేశంలో విషయాలను వెల్లడించారు. ఈ నెల 16, 17 తేదీలలో ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాలో ఉచిత శిక్షణతో పాటు, భోజన వసతి, మెటీరియల్, సర్టిఫికెట్స్ అందజేయనున్నట్లు వెల్లడించారు. పూర్తి సమాచారం కోసం 9963188715, 9550479388 నెంబర్లలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

హామీలను అమలు చేయాలని వినతి

మణుగూరుటౌన్, జూన్ 10: ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలతోపాటు అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎంసీపీఐ(యు) ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్ రాఘవరెడ్డికి వినతి పత్రమందజేశారు. నాయకులు ఎం మోహన్‌రావు మాట్లాడారు. రైతులకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటా మేరకు రూ.2 లక్షల రుణ మాఫీ చేయాలని, కౌలు రైతులకు రైతు బంధుతో పాటు ఇచ్చిన వాగ్ధానాలను అమలు చేయాలని కోరారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమౌతున్న కారణంగా అన్ని బ్యాంక్‌ల్లోను పంట రుణాలను తక్షణమే ఇవ్వాలని కోరారు. గ్రామాల్లో మౌళిక వసతులైన రోడ్లు తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పినపాక, జూన్ 10: మండలంలోని సీతారామపురం గ్రామం శివారు బీటీపీఎస్ గేటు వద్ద సోమవారం జరిగిన ప్రమాదంలో ఓ లారీ, ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్లే కొందరు గమనించి, హుటాహుటిన మణుగూరు ప్రభుత్వా సుపత్రికి తరలించారు. ప్రమాద సమాచారం అందుకున్న ఏడూళ్లబయ్యారం ఎస్ఐ వెంకటప్పయ్య ఘటనాస్థలాన్ని పరిశీలించి, లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు.

ప్రజల పక్షాన పోరాడటమే నా లక్ష్యం

- పేదల కష్టాలు గుర్తించేది కమ్యూనిస్టులే
- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచ రూరల్, జూన్ 10: ప్రజల పక్షాన పోరాడటమే తన లక్ష్యమని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం మండలంలోని సీతానగర్‌కాలనీ, నాగారంకాలనీ, రంగాపురం, పలు గ్రామపంచాయతీల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజల కష్టాలను గుర్తించేది కమ్యూనిస్టేలేనని అన్నారు. పదవులు కోసం కాకుండ ప్రజలకు సేవ చేసి గుర్తింపు తెచ్చుకోవాలని అన్నారు. రాష్ట్రంలో కొత్తగూడెం నియోకవర్గానికి ప్రత్యేక స్థానం వచ్చే విధంగా అభివృద్ధి చేస్తామన్నారు.ఈ ప్రాంత ప్రజల సమస్యలను పరిష్కరిందేకు పని చేస్తానని అన్నారు. పలు పార్టీలకు చెందిన సర్పంచులు ఆయన సమక్షంలో సీపీఐ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, జిల్లా నాయకులు ముత్యాల విశ్వనాథం, సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, అనుసిమిల్లి సాయిబాబు, సీపీఐ పార్టీ నాయకులు ఉప్పుశెట్టి రాహుల్, సుధాకర్, కిరణ్‌కుమార్, రమేష్, పాల్గొన్నారు.

సినిమా రివ్యూకు హాజరు కావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్: నర్మద సస్పెన్స్ సినిమా రివ్యూ షోకు ముఖ్య అతిధిగా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును ఆ చిత్ర యూనిట్ బృందం ఆహ్వానించింది. సోమవారం కొత్తగూడెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకొని మంగళవారం సాయంత్రం కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్ లోని పి.ఆర్. ఫంక్షన్ హాల్లో జరిగే ఈ రివ్యూ షో కార్యక్రమం నిర్వహిస్తున్నామని యూనిట్ బృందం తెలిపారు. కార్యక్రమంలో అభ్యుదయ కళా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, చిత్ర సమర్పకులు డాక్టర్ మద్దెల శివకుమార్, నిర్మాత ఆళ్ళ రాఘవ, చిత్ర దర్శకులు సుభాకర్, నటులు ధనరాజ్, వరచిత్ర, గాయకులు అల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.